
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 8 సెప్టెంబరు 2025

సింగరేణిలో ఇంటర్నల్ క్లరికల్
పోస్టుల భర్తీ ఎప్పుడో..?
యాజమాన్యం స్పందించాలని అభ్యర్థుల వేడుకోలు
6

భద్రాద్రికి 1,595 విగ్రహాల రాక

రెవెన్యూ వ్యవస్థ మరింత
బలోపేతం దిశగా..



శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లిన జీపీవో అభ్యర్థులు (ఫైల్)

- చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం
- క్లస్టర్‌కు ఒక జీపీవో..!
- నియామకాలు పూర్తి
- నేడో రేపో కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్
- గ్రామస్థాయిలో రెవెన్యూ కార్యకలాపాలు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టాన్ని క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలు చేసే లక్ష్యంతో.. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రామస్థాయిలో భూ వివాదాలను పరిష్కరించేందుకు సర్వేయర్ల భర్తీకి చర్యలు చేపట్టగా.. మరోవైపు గ్రామపరిపాలన అధికారుల నియామకాలపై దృష్టి సారించింది. గత ప్రభుత్వం రద్దు చేసిన గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థలో అప్పటి లోపాలను సరిచేస్తూ జీపీవో వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తుంది. గతంలో పనిచేసి వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన ఆర్వోలు, వీఆర్ఏలను తిరిగి సొంత శాఖలోకి తీసుకొస్తుంది. క్లస్టర్ల వారీగా గ్రామ పరిపాలన అధికారులను (జీపీవో) నియమించి భర్తీ చేస్తోంది. దీనికోసం ఆసక్తి కలిగిన వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి ఆప్షన్లను తీసుకుని.. వారికి అర్హత పరీక్షలను నిర్వహించి ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు జిల్లాలో ఇటీవల అర్హత సాధించిన పూర్వ వీఆర్వో, వీఆర్ఏ అభ్యర్థులను ఎంపిక చేసి శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం చేతుల మీదుగా నియామకపు లేఖలను అందించారు.

జిల్లాలో ప్రస్తుతం 380 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. 299 క్లస్టర్లుగా విభజించారు. క్లస్టర్‌కు ఒక జీపీవోను నియమించనున్నారు. తొలి రెండో విడతలో జరిగిన జీపీవో పరీక్షల్లో 243 మంది అర్హత సాధించారు. వీరిలో లోకల్ క్యాడర్‌లో 241 మందిని ఖమ్మం జిల్లాకు కేటాయించారు. నాన్‌లోకల్‌లో 13 మంది నియమితులయ్యారు. ఇతర విభాగాల్లో పనిచేస్తున్న మరో 48 మంది వీఆర్ఏలు (ఇప్పటికే జూనియర్ (మిగతా 6వ పేజీలో)

జీపీవోల బాధ్యతలు ఇవీ..

గ్రామస్థాయిలో జీపీవో అధికారులకు క్లస్టర్ల వారీగా ఆయా గ్రామాల పూర్తి నిర్వహణ బాధ్యతలను అప్పగించనుంది. గ్రామ ఖాతాల నిర్వహణ, ప్రజలకు కావాల్సిన ధ్రువపత్రాల జారీకి సంబంధించి విచారణలు నిర్వహించడం.. భూములు, చెరువులు, కుంటలు, నీటి వనరుల ఆక్రమణలపై విచారణతో పాటు రక్షణగా ఉండటం.. భూవివాదాలను పరిశీలించడం.. సర్వేయర్లకు సహకరించడం.. విపత్తు సమయాల్లో దగ్గరుండి సహాయక చర్యలు చేపట్టడం తోపాటు గ్రామంలో అత్యవసర సేవలు అందించే బాధ్యతలను జీపీవోలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఎన్నికల విధుల్లో సిబ్బందికి సహాయం చేయడంతో పాటు గ్రామంలో ప్రోటోకాల్ అధికారులకు సహకరించడం, గ్రామ, క్లస్టర్, మండల స్థాయి అధికారులతో సమన్వయంతో పనిచేయడం.. ప్రభుత్వ భూ పరిపాలన ప్రధాన కమిషనర్, కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ స్థాయి అధికారులు ఏ పని అప్పగించినా చేయాల్సి ఉంటుంది.



ఇక గ్రామస్థాయిలోనే సమస్యల పరిష్కారం
మన్నె గురుమూర్తి, జీపీవో

జీపీవో వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. ఈ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలోనే అనేక సమస్యలు పరిష్కారం అయ్యే ఆస్కారం ఉంటుంది. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా జీపీవో వ్యవస్థ ఉంటుంది. వీఆర్వో వ్యవస్థ రద్దు తర్వాత తీవ్రంగా నష్టపోయిన మాకు జీపీవో వ్యవస్థ ద్వారా మాకు న్యాయం చేసినట్లైంది. ఈ ప్రభుత్వం ఏ బాధ్యతలను అప్పగించినా చేయడానికి సిద్ధంగా ఉన్నాం.



అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

రాష్ట్రంలో భవిష్యత్
వ్యవసాయ రంగానిదే..

పామాయిల్ పంటలకు తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి

- రాష్ట్రంలో 10లక్షల ఎకరాల్లో పామాయిల్ విస్తరణ లక్ష్యం
- ప్రతీ జిల్లాలో 5వేల ఎకరాల్లో విస్తరణకు ప్రణాళిక
- ఈ ఏడాది 20 శాతం ఓఈఆర్ వచ్చేలా కృషి
- పామాయిల్‌తో రైతుల దశ మారింది
- ఫ్యాక్టరీలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకునేలా చర్యలు
- ఉత్పత్తికి అనుగుణంగా భవిష్యత్‌లో 30 వరకు ఫ్యాక్టరీల మంజూరు
- ఇప్పటికే సిద్దిపేట ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి
- వచ్చే ఏడాదికల్లా వనపర్తి, బీచ్‌పల్లి, కల్లూరుగూడెం ఫ్యాక్టరీలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవిష్యత్ వ్యవసాయ రంగానిదేనని మంత్రి తుమ్మల నాగేశ్వరావు అన్నారు. ముఖ్యంగా పామాయిల్ విస్తరణతో తెలంగాణ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవనుందన్నారు. ఇతర రాష్ట్రాల రైతులకు ఈ ప్రాంతంలోని తోటలు ఉత్ప్రేరణ కలిగించేలా అభివృద్ధి చెందాలన్నదే తన లక్ష్యమన్నారు. ఆదివారం భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని మంత్రి తుమ్మల ఆకస్మికంగా సందర్శించారు. ఫ్యాక్టరీలో యంత్రాలు, వాటి పని విధానం, పండ్లు ఎలా వస్తున్నాయి, సమస్యలు ఏమి ఉన్నాయోనని స్వయంగా పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలు పామాయిల్ తోటలకు అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాదిలో కనీసం 10లక్షల ఎకరాలలో పామాయిల్‌ను విస్తరించాలనే లక్ష్యం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో 5వేల నుంచి 6వేల ఎకరాల్లో పామాయిల్ తోటలు విస్తరించాలనేది తన లక్ష్యమన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్ఫూర్తితో ఈ ప్రాంతంలో పామాయిల్ మొక్కలు వేశామన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఫ్యాక్టరీ అవసరాల కోసం ఇక్కడ స్థలాన్ని కేటాయించడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతమైన సత్తుపల్లి నియోజకవర్గంలో ఆనాడు వర్షాధారమైన పంటలతో కాలం వెళ్లదీసే వారన్నారు. పంట గ్యారంటీ లేదన్నారు. ఆ తర్వాత బోర్లపై ఆధారపడి నాటు పుగారు, వర్జీనియా పొగాకు, సీడ్ మొక్కజొన్న పంటలు వేసేవారన్నారు. వ్యవసాయం అభివృద్ధి చేయాలని, వ్యవసాయమే మన ప్రాంతాన్ని ముందుకు తీసుకెళతుందనే ఉద్దేశ్యంతో రైతులకు మేలు జరగాలని నిర్ణయించి ఇరిగేషన్‌ను, రహదారులను అభివృద్ధి (మిగతా 6వ పేజీలో)



రంగనాయకుల గుట్టపై ఉన్న ధ్యాన మందిరం

ఆడిటోరియం
నిర్మించండి..

- భద్రాద్రికి అన్ని హంగులతో ఆడిటోరియం అవసరమే..
- మాస్టర్ ప్లాన్‌లో చోటు కల్పించాలంటున్న భద్రాద్రివాసులు

భద్రాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు సిద్ధమైన తరుణంలో భద్రాద్రికి అన్ని హంగులతో ఆడిటోరియం అవసరమేనని భద్రాద్రివాసులు పేర్కొంటున్నారు. తరచూ సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు జరుగుతున్న క్రమంలో ఆధ్యాత్మిక రాజధానిగా పేరుగాంచిన భద్రాద్రికి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి మాదిరి ఆడిటోరియం ఎంతో అవసరమని కళాకారులు అభిప్రాయపడుతున్నారు. భక్తరామదాసు జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని వాగ్గేయకారోత్సవాలు నిర్వహిస్తుండగా, తూము నరసింహదాసు జయంతి ఉత్సవాలను సైతం నిర్వహిస్తున్నారు. అలాగే వైకుంఠ ఏకాదశి, శ్రీరామనవమి సమయంలో సైతం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వీటిని తిలకించేందుకు వచ్చే భక్తులు, అభిమానులకు ఆడిటోరియం ఎంతగానో ఉపయోగపడుతుందని అంతేకాకుండా కళాకారులు ఆ వేదికపై తమ కళలను ప్రదర్శించేందుకు వెసులుబాటు లభిస్తుంటున్నారు. ఎంతో ప్రసిద్ధమైన భద్రాచలంకు ఇంకా ఆడిటోరియం లేకపోవడం బాధాకరమని వారు వాపోతున్నారు.

నిరుపయోగంగా ధ్యాన మందిరం

భద్రాద్రి దేవస్థానానికి భక్తరామదాసు ధ్యాన మందిరం ఉండగా.. అది నిరుపయోగంగా ఉందనే విమర్శలు లేకపోలేదు. దాని ఆలనాపాలన చూసేవారు కరువవడంతో.. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ధ్యాన్య మందిరం ఉందనే సమాచారం కూడా తెలియని పరిస్థితి. రంగనాయకుల గుట్టపై 1962 జనవరి 5న అప్పటి ఉప రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ మందిరాన్ని 1971 నవంబరు 5న అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఆనాడు భక్తరామదాసు స్మారకంగా నిర్మించిన మందిరంలో ఆయన రచించిన కీర్తనలను శిలాఫలకాలపై చెక్కి రామ భక్తులు తిలకించేందుకు అందుబాటులోకి తెచ్చారు. అయితే కాలక్రమంలో పట్టించుకోకపోవడంతో రంగులు వేయకపోవడంతో.. అవి పూర్తి స్పష్టతతో కనిపించని (మిగతా 6వ పేజీలో)

ప్రొటోకాల్ రగడ

- అసెంబ్లీ స్పీకర్ వరకు వెళ్లిన లొల్లి..
- ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల సాక్షిగా అధికారుల మధ్య సమన్వయ లోపం

7

ఎన్నికల నిర్వహణ
పార్టీల వ్యవహారం కాదు..



మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

- ప్రజలకు, ప్రజాస్వామ్యానికి సంబంధించింది..
- ఎన్నికల సంఘం మాయాజాలం వల్లే ఫలితాల తర్వాత పోలింగ్ శాతం వెల్లడి
- కేంద్రం నెమ్మదిగా ప్రజలకు ఓట్ల చోరీని అలవాటు చేస్తోంది
- ప్రముఖ వక్త పరకాల ప్రభాకర్

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ అనేది రాజకీయ పార్టీల వ్యవహారం కాదని.. ప్రజలకు, ప్రజాస్వామ్యానికి సంబంధించిందని ప్రముఖ వక్త పరకాల ప్రభాకర్ అన్నారు. దేశంలో అధికారంలో ఉన్నవాళ్లు ఎన్నికలను ఏ రాష్ట్రంలో గెలవాలో, ఏ రాష్ట్రాలను వదిలి వేయాలో నిర్ణయించుకొని ఎలక్షన్లను నిర్వహిస్తున్నారన్నారు. ప్రత్యామ్నాయ పౌర సమూహం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో 'ఎలక్షన్ కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)' పేరుతో బిహార్‌లో 65లక్షల ఓట్లను తొలగించడాన్ని నిరసిస్తూ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ రవీంద్రనాథ్, ప్రముఖ వక్త పరకాల ప్రభాకర్‌లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖమ్మం వాసి ఈరోజు గణపతి లడ్డూను వేలంలో రూ.50 లక్షల పైనే ఖరీదుకు కొనడం ఒక విషయమైతే.. గత నెల పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ర్యాలీ జరగడం మరొక మంచి విషయమని అన్నారు. దేశంలో అధికారంలో ఉన్నవాళ్లు ఎలక్షన్‌లో ఏ రాష్ట్రంలో గెలవాలో, ఏ రాష్ట్రాలను వదిలి వేయాలో నిర్ణయించుకొని ఎన్నికలను నిర్వహిస్తున్నారన్నారు. గెలవాలనుకున్న రాష్ట్రాలలో ఎక్కువ దశలలో ఎన్నికల నిర్వహణ జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో చీఫ్ జస్టిస్‌ను తప్పించి కేంద్ర మంత్రిని చేర్చడం ద్వారా విశ్వసనీయత దెబ్బతిందన్నారు. ఎన్నికలు ముగిసిన రోజు ప్రకటించిన ఓటింగ్ శాతానికి, ఫైనల్ ఓటింగ్ శాతానికి మధ్య 11 రోజుల సమయం పట్టిందన్నారు. చండీఘడ్‌లో కేవలం 644 పోలింగ్ బూతుల సమాచారం రావడానికి 5 రోజులు పట్టడం హాస్యాస్పదమని అన్నారు. ఆంధ్రాలో ప్రొవిషనల్, ఫైనల్ పర్సంటేజీల మధ్య తేడా 12.5 శాతంగా ఉందన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ శాతం 5 కోట్ల ఓట్లుగా ఉందన్నారు. ఈ తేడా లేకపోతే ప్రతిపక్ష పార్టీలకు 305 సీట్లకు పైగా వచ్చేవన్నారు. ఫేస్ 2 ఎన్నికల డేటా కనీసం స్టేట్ వైస్‌గా కూడా ఇంతవరకు లేదన్నారు. ఇందులో (మిగతా 6వ పేజీలో)



భద్రాద్రి ప్రధాన ఆలయానికి తాళాలు వేసి సీలు వేస్తున్న సిబ్బంది

భద్రాద్రి రామాలయం
మూసివేత

- చంద్ర గ్రహణ ప్రభావం వల్లే..
- నేడు మూడు గంటలకు సుప్రభాతం

భద్రాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ తలుపులను ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు మూసివేశారు. అంతకు ముందు వేద పండితులు మూలవరుల అభిషేకం, ఇతర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటిగంట కావడంతోనే రామాలయ ప్రధాన ద్వారానికి ఏఈవో శ్రావణ్ కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా సమక్షంలో ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఇతర సిబ్బంది తలుపులు మూసి తాళాలు వేశారు. అనంతరం రాజగోపురం వద్ద ఉన్న ప్రధాన ద్వారాన్ని సైతం మూసివేసారు. అప్పటి నుంచి ఆలయ ప్రాంగణంలోకి భక్తులను అనుమతించలేదు. ఇదిలా ఉండగా.. ఆదివారం రాత్రి గ్రహణం (మిగతా 6వ పేజీలో)



ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో
వెనుకబాటే..

- చర్యలు లేకపోవడంతోనే అమలుకాని వంద శాతం హాజరు
- సిగ్నళ్లు లేవని, ఆన్‌లైన్ పని చేయడం లేదనే సాకులు
- ఆలస్యంగా పాఠశాలలకు వస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యలో ఉపాధ్యాయుల హాజరుపై పారదర్శకత పెంపొందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఈ ఏడాది ఆగస్టు 1న ఫేషియల్ రికగ్నిషన్ (ఎఫ్ఆర్ఎస్) హాజరును ప్రవేశపెట్టింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తోంది. నెలరోజులు దాన్నే ప్రామాణికంగా తీసుకొని వేతనాలు చెల్లిస్తామని ప్రకటించిన ప్రభుత్వం.. ఆ విషయాన్ని పట్టించుకోక పోవడంతో జిల్లాలోని కొందరు ఉపాధ్యాయులు నేటికీ పాఠశాలలకు ఆలస్యంగానే వెళుతున్నారనే విమర్శలు వినబడుతున్నాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 1180 పాఠశాలల్లో 5801 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. కానీ ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో మాత్రం 4420 మందే హాజరు నమోదు చేస్తున్నారు. మిలిన 1380 మంది ఫేస్ హాజరుకు దూరంగా ఉంటున్నారు. వీరిలో కొందరు సెలవులలో మరికొందరు పాఠశాలలకు ఆలస్యంగా వచ్చి సిగ్నల్స్ లేవనే నెపంతో హాజరు నమోదు కావడం లేదనే వాదనలు వినవస్తున్నాయి.

దుమ్మాలకు చెక్ చెప్పడానికే..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పలువురు ఉపాధ్యాయులు దుమ్మాలు కొడుతున్నారన్న ఆరోపణలకు చెక్ పెట్టడానికి ఎఫ్ఆర్ఎస్‌ను అమలులోకి తెచ్చింది. కొందరు ఉపాధ్యాయులు రియల్ ఎస్టేట్ వ్యాపారం, బీమా, చిట్స్, కార్పొరేట్ కళాశాలల పీఆర్‌వోలుగా తదితర వ్యాపారాలు చేస్తూ పాఠశాలలకు దుమ్మా కొడుతున్నారనే ఆరోపణలు రావడం, మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు సమయానికి వెళ్లకపోవడం, వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారనే ఫిర్యాదులు గతంలో వచ్చాయి. వీటికి పరిష్కారంగా ప్రభుత్వం ఉపాధ్యాయుల హాజరు శాతం పెంచి, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలన్న లక్ష్యంతో ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని అమలు చేస్తోంది. అయినా కొందరి ఉపాధ్యాయులలో ఇంకా మార్పు రాలేదనే చెప్పొచ్చు. పాఠశాలలకు ఆలస్యంగా వచ్చి సిగ్నళ్లు లేవని, ఆన్‌లైన్ (మిగతా 6వ పేజీలో)

ఖమ్మంలో ప్రభుత్వ యూనివర్సిటీని ప్రకటించాలి

» ఎస్ఆర్‌బీజీయన్ఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు తిరుమలరావు


నారాయణరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధం గా ఖమ్మంలో ప్రభుత్వ యూనివర్సిటీని వెంటనే ప్రకటించాలని ఎస్ఆర్ బీజీయన్ ఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమలరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఆర్‌బీజీయన్ఆర్ కళాశాల భూరి విరాళ దాత అయిన గెం టేల నారాయణ రావు 64వ వర్ధంతి సందర్భంగా కళాశాల ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లు గడుస్తున్నా, ముగ్గురు మంత్రులు ఉండి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేయలేదని అన్నారు. అన్ని వసతులు ఉండి, ఎంతో చరిత్ర ప్రాధా న్యత ఉన్న ఎస్ఆర్‌బీజీయన్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలను యూనివర్సిటీగా ప్రకటించి ఖమ్మం ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ కళాశాలలు దీనికి అనుసంధానం చేయాలని కోరారు. వాగ్దానం నెరవేర్చకపోతే ఈ కళాశాల పూర్వ విద్యార్థులు లక్ష కుటుంబాల ఆగ్రహం చవి చూడాల్సి వస్తోందని ఆయన హెచ్చరించారు. ఈ కళాశాలకున్న 69 ఎకరాల భూమి 29ఎకరాలకు కుంచించుకుపోయిందని, విలువైన కళాశాల భూమి లీజులు పేరుతో పందేరం చేయడం మానుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ కనీస అనుమతి లేకుండా ఐటీహబ్ పేరుతో లీజులు పొందారని, గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు ఈ ప్రభుత్వంలో కొనసాగిస్తున్నారని అన్నారు. ఖాళీ చేసిన కూరగాయల మార్కెట్ భూమిని వెంటనే ఎస్ఆర్‌బీజీయన్ఆర్ కళాశాల పీజీ తరగతి గదుల నిర్మాణం కోసం అప్పగించాలని ఆయన కోరారు. కళాశాల ఔన్నత్యం కాపాడడానికి పూర్వ విద్యార్థి సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు వేగినాటి. లక్ష్మయ్య, దగ్గుల మాధవరెడ్డి, యస్.మణిభూషనాచారి, వూడుగు వెంకటేశ్వర రావు, వీరభద్రం, నాళ్ళ బానూచందర్, పిక్క షారెడ్డి, బోగ గిరి, వి.సైదేశ్వరరావు పాల్గొన్నారు.

సింగరేణిలో ఇంటర్నల్ క్లరికల్ పోస్టుల భర్తీ ఎప్పుడో..?

» యాజమాన్యం స్పందించాలని అభ్యర్థుల వేడుకోలు


సింగరేణి ప్రధాన కార్యాలయం

రుద్రంపూర్, (సింగరేణి) సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఖాళీగా ఉన్న 360 క్లరికల్ పోస్టుల భర్తీ కోసం యాజమాన్యం 2004 మార్చిలో నోటిఫికేషన్ విడుదల చేసింది. సింగరేణి వ్యాప్తంగా 360 పోస్టుల భర్తీ కోసం యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేయడంతో 6వేల మంది ఇంటర్నల్ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు చేసుకున్న 6వేల మంది అభ్యర్థులు పోస్టుల భర్తీకోసం 18 నెలలుగా ఎదురుచూపులు చూస్తున్న పరిస్థితి నెలకొంటుంది. సింగరేణి యాజమాన్యం వెంటనే స్పందించి ఇంటర్నల్ క్లరికల్‌పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని అభ్యర్థులు వేడుకుంటున్నారు. 2004మార్చి నెలలో యాజమాన్యం 8విభాగాల్లో పని చేస్తున్న ఇంటర్నల్ పోస్టుల భర్తీకోసం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జూనియర్ అకౌంట్ ఆఫీసర్, అండర్‌మేనేజర్ ట్రైనీ, అసిస్టెంట్ ఇంజనీరు, డిప్లమో ఇంజనీరింగ్ అండ్‌మైనింగ్, వెల్డర్‌ట్రైనీ, ఫిట్టర్ ట్రైనీ ఉద్యోగుల ఇంటర్నల్ అభ్యర్థులకు నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు సైతం నిర్వహించి పో స్టులను భర్తీ చేసింది. అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిన యాజమాన్యం ఇంటర్నల్ క్లరికల్‌పోస్టుల భర్తీపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు ఆరోపిస్తోన్నారు. 360పోస్టుల భర్తీ కోసం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 6వేలమంది దరఖాస్తులు చే సుకుంటే పోస్టులు భర్తీ చేయకుండా జాప్యం చేయడంలో ఆంతర్యం ఏమిటని పలు కార్మికసంఘాలు ప్రశ్నిస్తున్నాయి. సింగరేణి వ్యాప్తంగా అనేక విభాగాల్లో కర్లికల్ పోస్టుల్లో ఉన్న ఉద్యోగులు రిటైర్‌మెంట్ కావడం వల్ల ఉన్న ఉద్యోగులపై విపరీతమైన పని భారం పెరుగుతుందని పలువురు ఆరోపిస్తోన్నారు. పోస్టులను భర్తీ చేసుకుంటే సంస్థకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కార్మిక సంఘాలు వ్యాఖ్యానిస్తోన్నాయి. సింగరేణి యాజమాన్యం అనేక సం స్కరణలు చేపడుతున్న నేపథ్యంలో ఖాళీగా ఉన్న 360 పోస్టుల భర్తీకి వెంటనే రాతపరీక్షలు నిర్వహించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

భద్రాద్రికి 1,595 విగ్రహాల రాక

భద్రాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని పవిత్ర గోదావరి నదిలో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి నాలుగు రోజుల పాటు విగ్రహాలు తరలిరావడం జరిగింది. స్థానిక నిమజ్జన ఘాట్‌లో గత 24 గంటల్లో భారీగా విగ్రహాలు వచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విగ్రహాలను ముందుగా ఒక చోటకు చేర్చి విడదతల వారీగా వాటిని గోదావరిలో క్రేన్ల సహాయంతో లాంచీలపైకి తరలించి నిమజ్జనం చేశారు. ఆదివారం మధ్యాహ్నం వరకు తరలివచ్చిన విగ్రహాలను నిమజ్జనం కోసం సిద్ధం చేశారు. కాగా రాత్రి వరకు విగ్రహాల నిమజ్జనం కొనసాగడం జరిగింది. ఈసారి మొత్తం 1,595 విగ్రహాలు భద్రాచలం రావడం జరిగిందని అధికారిక లెక్కల ద్వారా తెలుస్తోంది. అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టడంతో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. మొత్తంగా ప్రశాంతంగా గణేష్ నిమజ్జనం ముగియడంతో అధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.


విగ్రహాలను క్రేన్ ద్వారా లాంచీల్లోకి ఎక్కిస్తున్న దృశ్యం


నిమజ్జనానికి సిద్ధంగా ఉంచిన విగ్రహాలు

పేదల వైద్యుడు వీరయ్య

» దశాబ్దకాలంగా ఉచితంగా వైద్యసేవలు


చెట్టుమందుతో కట్టుకడుతున్న వీరయ్య

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదలు ఉచితంగానే వైద్యసేవలు అందిస్తూ నిత్యం పేదల సేవలోనే నిలిచిపోతున్నాడు ఈ ప్రజావైద్యుడు.. ఎటువంటి పట్టా లేకుండా ప్రజావైద్యుడుగా ప్రసిద్ధికెక్కి ప్రాచుర్యం పొందుతున్నాడు. కాళ్ల చేతులు విరిగితే వేలాది రూపాయలు ఖర్చు పెడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారితోపాటు అసలు వైద్యసేవలకు చిల్లిగవ్వ చెల్లించని వారికి ఆపన్నహస్తం అందిస్తున్నాడు. ఇల్లెందు పట్టణంలోని 1వ వార్డు సత్యనారాయణపురానికి చెందిన కాశబోయిన వీరయ్య 10ఏళ్లుగా తాను స్వతాహాగా నేర్చుకున్న పసరు వైద్యంతో కాళ్లు, చేతులు విరిగిన వారికి మోకాళ్ల నొప్పులు, కిడ్నిలో రాళ్లు, చర్మ వ్యాధులు, పాము, తేలు కాటులకు ఆకుమందులతోనే వైద్యం అందిస్తున్నాడు. ఆయన వద్ద వైద్యం పొందిన వారు తమకు నయం కావడంతో ఉబ్బితబ్బిపోతున్నారు. కేవలం 7వ తరగతి వరకే చదువుకున్న వీరయ్య వ్యవసాయం చేస్తూ మేకలు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. మూడు పర్యాయాలు కట్టు కడితే మోకాళ్ల నొప్పులు మాయమైపోతాయని పేర్కొంటున్నాడు. కుమారుడు, కుమార్తె, భార్య ఉండగా వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా జీవనం సాగిస్తున్నప్పటికీ పసరు వైద్యాన్ని ఎంచుకుని సేవలుచేయడం అభినందనీయమంటూ ఆయన వద్ద వైద్యసేవలు పొందిన పలువురు ప్రశంసిస్తున్నారు.

ఆనందంగా ఉంది..

● కాశబోయిన వీరయ్య



పేద రోగులకు అండగా ఉండేందుకే వైద్యం చేస్తున్నాను. 10 సంవత్సరాల క్రితం ఓ బిచ్చగాడు మా ఇంట్లో ఆవుకు వైద్యం చేయగా అదేవిధానాన్ని అవలంబిస్తున్నాను. ప్రతి రోజు సుదూర ప్రాంతాల నుంచి కూడా వైద్యం కోసం వస్తున్నారు. వారికి ఉచితంగానే సేవలు చేస్తున్నాను. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవ చేయడం పట్ల ఆనందంగా ఉంది.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

» భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్


చికెన్‌ను పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీఈడీ కళాశాలలో చదివే విద్యార్థులకు సమయానుకూలంగా మెనూ ప్రకారం ప్రతి రోజు పౌష్టికాహారం అందించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. ఆదివారం బీఈడీ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థినులకు తయారు చేస్తున్న వంటకాలను, చికెన్, కూరగాయలు, వండిన ఆహారంను పరిశీలించారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ వర్షాకాలం నడుస్తున్నందున వండిన ఆహారం వేడిగా ఉన్నప్పుడే వడ్డించాలని, విద్యార్థినులకు వండిన భోజనం సరిగా లేకపోవడంతో మెనూ ప్రకారం తప్పనిసరిగా చికెన్ ఉండవలసి ఉండగా చికెన్ సరఫరా లేటుగా అవడంతో కాంట్రాక్టర్‌ను మందలించారు. అలాగే అన్ని విద్యా సంస్థలకు చికెన్ సకాలంలో అందుతున్నది లేనిది పరిశీలించాలని ఏటీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో అశోక్‌కుమార్, టీఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడిటోరియం నిర్మించండి..

(5వ పేజీ తరువాయి)

పరిస్థితి ఉంది. ఇదిలా ఉండగా.. భద్రాచలం రామాలయ ప్రాంగణంలో ఉన్న చిత్రకూట మండపాన్ని రామాలయ అభివృద్ధి పనుల్లో భాగంగా అక్కడ నుంచి తొలగించే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం ఉంది. ఈ క్రమంలో సంగీత సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు అరుదైన వేదికగా ఉండేందుకు ఆడిటోరియం అవసరం ఉందని రంగస్థల నటులు, సినీ దర్శకులు తాండ్ర వెంకటరమణారావు పేర్కొంటున్నారు. ప్రభుత్వం, దేవస్థానం అధికారులు ఈ విషయమై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. కాగా.. ఈ విషయమై భద్రాద్రికి చెందిన పలువురు ప్రముఖులు భద్రాద్రి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావును కలిసి ఆడిటోరియం నిర్మాణం చేపట్టాలనే విషయమై అభ్యర్థించేందుకు సిద్ధమవుతున్నారు.

భద్రాద్రి రామాలయం మూసివేత


భద్రాద్రి ప్రధాన ఆలయానికి తాళాలు సీలు వేసిన దృశ్యం

(5వ పేజీ తరువాయి)

అనంతరం సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు శ్రీ సీతారామచంద్రస్వామి వారి సుప్రభాతం, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, ఆరాధన, సేవాకాలం, నివేదన నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 7.30 గంటల నుంచి భక్తులను మూలవరుల దర్శనానికి అనుమతించనున్నారు. కాగా.. సుప్రభాత సేవ సమయంలో భక్తులకు దర్శనాలకు అనుమతించరు. ఇదిలా ఉండగా.. భద్రాద్రి దేవస్థానం అనుబంధ ఆలయాలైన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం, శ్రీరంగనాథస్వామి వారి ఆలయం, గోవిందరాజ స్వామి వారి ఆలయ తలుపులు మూసి తాళాలు వేశారు. అదేవిధంగా పట్టణంలోని ఇతర ఆలయాలను సైతం చంద్రగ్రహణాన్ని పురస్కరించుకొని తలుపులకు తాళాలు వేసి మూసివేశారు.

చంద్రగ్రహణ ప్రభావం వల్లే..

ఖమ్మంఖానాపురంహవేలి: చంద్రగహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆలయాలన్ని మూసివేశారు. నగరంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శ్రీభ్రమరాంబ సమేత గుంటుమల్లేశ్వర స్వామి ఆలయం, శ్రీసత్యనారాయణ సహిత వీరాంజనేయ స్వామి ఆలయం, కమాన్‌బజార్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం, రెడ్డిపల్లి మారెమ్మ తల్లి ఆలయం, పర్ణశాల రామాలయం, బాలగణపతి ఆలయం, జీళ్లచెర్వు వేంకటేశ్వరస్వామి ఆలయం, బ్రాహ్మణబజారులోని శివాలయం, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, అభయ వేంకటేశ్వరస్వామి ఆలయం, అంకమ్మతల్లి, శ్రీనివాస నగర్ అయ్యప్ప స్వామి ఆలయంతోపాటు జిల్లాలోని పలు ఆలయాలు మూసివేశారు. సోమవారం ఉదయం ఆలయ శుద్ధి అనంతరం 10 గంటల నుంచి భక్తుల దర్శనాలకు అనుమతి ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో వెనుకబాటే..

(5వ పేజీ తరువాయి)

పని చేయడం లేదనే సాకులు చెబుతూ ఇతర వ్యాపారాలు సాగిస్తున్నారనే విమర్శలు వినపడుతున్నాయి. ఇలాంటి వారిపై విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కొందరు ఉపాధ్యాయులు కోరుతున్నారు.

పారదర్శకత కోసమే..

పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరులో పారదర్శకత కోసమే ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానాన్ని అమలు చేస్తోంది. కానీ వేతనాలు పాత పద్ధతి (రిజిస్టర్‌లో సంతకాలు)నే చెల్లిస్తుండడంతో.. ఇది నామమాత్రంగా తయారైంది. విధుల్లో అంకితభావంతో ఉండే ఉపాధ్యాయులు దీన్ని పక్కాగా వినియోగిస్తున్నారు. మిగిలిన వారు పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

ఖమ్మం జిల్లాలో మండలాల వారీగా ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు

ముదిగొండలో 85.71 శాతం, వైరా 84.68, కామేపల్లి 84.40, బోనకల్ 84.16, వేంసూర్ 82.45, పెనుబల్లి 81.29, తల్లాడ 80.38, సత్తుపల్లి, 79.74, సింగరేణి 79.39, కొణిజర్ల 78.89, ఏన్కూర్ 78.64, కల్లూరు 78.51, ఖమ్మం అర్బన్ 75.73, తిరుమలాయపాలెం 75.23, ఖమ్మం రూరల్ 73.73, మధిర 72.90, కూసుమంచి 69.05, నేలకొండపల్లి 68.44, చింతకాని 67.67, ఎర్రుపాలెం 66.99, రఘునాథపాలెం 57.75 శాతం హజరు నమోదు జరిగినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇది రోజువారీ హాజరులో మారుతూ ఉంటుంది. కానీ జిల్లాలో ఎక్కడా వందశాతం హాజరు నమోదు కావడం లేదు.

రాష్ట్రంలో భవిష్యత్ వ్యవసాయ రంగానిదే..

(5వ పేజీ తరువాయి)

చేశామని తుమ్మల తెలిపారు. అనంతరం విద్య, వైద్యాన్ని అభివృద్ధి చేశామన్నారు. రైతులకు నికర ఆదాయాన్ని తెచ్చి పెట్టే పామాయిల్ పంట వల్ల రైతులకు భవిష్యత్‌లో ఎంతో మేలు ఉంటుందని గమనించి ఆ పంటను మొదటి నుంచి ప్రోత్సహించినట్టు చెప్పారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో లక్షా ఇరవై వేల ఎకరాల్లో పామాయిల్ విస్తరించిందని, ఇందుకు అనుగుణంగా అశ్వారావుపేటలో, అప్పారావుపేటలో ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీలను నిర్మించినట్టు తెలిపారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక ఓఈఆర్ సాధించి, పామాయిల్ ధర నిర్ణయంలో ఆయిల్‌ఫెడ్ కీలకంగా ఉండేలా చర్యలు తీసుకున్నామని తుమ్మల వివరించారు. పామాయిల్ ధరలలో ఎగుడు దిగుడులను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం ద్వారా 44శాతం దిగుమతి సుంకాన్ని విధించడం ద్వారా పామాయిల్ రైతులకు మేలు జరిగేలా చేయగలిగామని చెప్పారు. ఈ ఏడాది పామాయిల్ ఓఈ ఆర్ 20శాతానికి పెంచేలా అధికారులు చేస్తున్న కృషిని మంత్రి అభినంధించారు. సిద్దిపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి చేసుకొని ట్రయల్ రన్ నడుస్తుందన్నారు. వచ్చే ఏడాదికల్లా వనపర్తి, బీచ్‌పల్లితో పాటు ఖమ్మం జిల్లాలోని కల్లూరుగూడెం ఫ్యాక్టరీలు పూర్తి కానున్నట్టు తుమ్మల ప్రకటించారు.

● **అంతర పంటలతోనూ ఎన్నో లాభాలు..**

పామాయిల్‌లో కోకో, వక్క, జాజి వంటి అంతర పంటలు ఎన్నో లాభాలను ఇస్తాయని మంత్రి తుమ్మల అన్నారు. మొదటి మూడేళ్లలో తాత్కాలికమైన పంటలు అంతర పంటలుగా వేసుకొని రైతులు లాభాలను పొందవచ్చన్నారు. భవిష్యత్‌లో ప్రతీ జిల్లాలో పామాయిల్ తోటలను విస్తరింపచేసి రాష్ట్రవ్యాప్తంగా 25 నుంచి 30 ఫ్యాక్టరీల వరకు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో పామాయిల్ తోటలు చూసేందుకు దేశంలోని ఇతర రాష్ట్రాల వారు తెలంగాణాను సందర్శించేలా తీర్చిదిద్దుతామన్నారు. పామాయిల్ ప్రవేశంతో ఈ ప్రాంత రైతుల జీవనగతే పూర్తిగా మారిపోయిందని, ఇది తనకెంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. రైతుల క్షేమం కోసం పామాయిల్ విస్తరణతో పాటు కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలు విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకోసం తన శక్తియుక్తులన్నింటినీ ఉపయోగిస్తున్నానని.. రైతులు, అధికారులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని పని చేయాలని మంత్రి తుమ్మల కోరారు. దమ్మపేట మండలం అప్పారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీని అత్యాధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్మించడం జరిగిందని, అశ్వారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీని తెలంగాణాలోనే మొదటి సారిగా 20 ఏళ్ల క్రితం నిర్మించామన్నారు. భవిష్యత్‌లో ఈ ఫ్యాక్టరీని ఆధునిక సాంకేతిక పద్ధతుల్లో అభివృద్ధి చేస్తానని తుమ్మల ప్రకటించారు. ఇప్పటికే పవర్ ప్లాంట్‌ను నిర్మించామన్నారు. ప్రస్తుతం తెలంగాణాలోని వివిధ జిల్లాల్లో ఉత్పత్తి అవుతున్న పామాయిల్ గెలలన్నీ అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీలకు వస్తున్నాయన్నారు. భవిష్యత్‌లో ఫ్యాక్టరీల సంఖ్యను పెంచుతున్నట్టు తెలిపారు. ప్రైవేటు కంపెనీల ద్వారా నిజామాబాద్, నిర్మల్, పెద్దపల్లి, ములుగు, ఖమ్మం ప్రాంతాలలో ఫ్యాక్టరీలు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, లాభాలు అందించే దిశగా తన శక్తిమేర కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.


అశ్వారావుపేటలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

● **అప్పారావుపేట ఫ్యాక్టరీలో లీప్ అండ్ సాయిల్ అనాలసిస్ ల్యాబ్**

అప్పారావుపేట ఫ్యాక్టరీలో లీప్ అండ్ సాయిల్ అనాలసిస్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు మంత్రి తుమ్మల ప్రకటించారు. బొరాన్, మెగ్నీషియమ్ రాయితీపై అందించేందుకు ప్రతిపాదనలు ఉన్నట్టు చెప్పారు. వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. వ్యవసాయ పనిముట్లు, ఎరువులపై పన్ను తగ్గించాలని కేంద్రాన్ని కోరామని.. ఈ నేపథ్యంలోనే 18శాతంగా ఉన్న పన్ను శాతం 5శాతానికి తగ్గిందని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికలను బలోపేతం చేసి ప్రతీ మంగళవారం రైతులు, శాస్త్రవేత్తలు, ఆదర్శ రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి.. వ్యవసాయం, పామాయిల్, ఉద్యాన పంటల అభివృద్ధి, పరిజ్ఞానం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అశ్వారావుపేట, సిద్దిపేట, బీచ్‌పల్లిలో రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి పామాయిల్‌కు సంబంధించి అన్ని సేవలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్, ఇతర అన్ని సేవలను ఆన్‌లైన్ ద్వారా కూడా రైతులు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ముందుకెళుతున్నట్టు తుమ్మల ప్రకటించారు. ఈ సమావేశంలో టీఎస్ ఆయిల్‌పామ్ రైతు సంఘ అధ్యక్షులు ఆలపాటి ప్రసాద్, ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్‌లు నాగబాబు, కళ్యాణ్, కాంగ్రెస్ నాయకులు బండి భాస్కరరావు, నిర్మల పుల్లారావు, కాసాని నాగ ప్రసాద్, కెవీ, కొయ్యల అచుతరావు, కాసాని చంద్రమోహన్, జేస్ట సత్యనారాయణ చౌదరి, మొగళ్ళపు చెన్నకేశవరావు తదితరులున్నారు.

సీసీఆర్టీకి పెదపాడు ఉపాధ్యాయుడి ఎంపిక



దుమ్ముగూడెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండలం పెద పాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్ ఎం.మోహన్‌కుమార్ ఢిల్లీ సీసీఆర్‌టీ(సెంటర్ ఫర్ కల్చరల్ రీసోర్స్ అండ్ ట్రైనింగ్) కేంద్రంలో జరగనున్న నూతన విద్యావిధానంపై శిక్షణ కోసం ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో మే-2025లో ఎస్సీఈఆర్‌టీ నిర్వహించిన పలు విభాగాల్లో బెస్ట్ ప్రాక్టీసెస్ కింద రాష్ట్రం నుంచి మొత్తం వందమంది టీచర్లు ఎంపికయ్యారు. ఎన్ఈపీ-2020 ప్రోగ్రాం(నూతన విద్యావిధానం)కు సంబంధించి రాష్ట్రంలో మొత్తం పదిమంది ఎంపికవగా, వారిలో భద్రాద్రి జిల్లా నుంచి మోహన్‌కుమార్ ఒక్కరే ఉన్నారు. ఈనెల 10 నుంచి 24 వరకు న్యూఢిల్లీలో జరగనున్న ఎన్ఈపీ-2020 ప్రోగ్రాంపై శిక్షణ పొందుతారు. ఈ సందర్భంగా మోహన్‌కుమార్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

రెవెన్యూ వ్యవస్థ మరింత బలోపేతం దిశగా..

(5వ పేజీ తరువాయి)

అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారు). మొత్తంగా 299 మందితో క్లస్టర్‌కు ఒక జీపీవోను నియమించనున్నారు. దీనికోసం జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. సోమ, మంగళవారం రోజుల్లో ఉన్నతాధికారులు జీపీవోలకు కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

బాధ్యతాయుతంగా పనిచేస్తాం

● షేక్ నాగుల్‌మీరా, జీపీవో



గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడం ద్వారా మేమే తీవ్రంగా నష్టపోయాం. తాజాగా ప్రభుత్వం మమ్మల్ని తిరిగి జీపీవోగా నియమించడం హర్షనీయం. ప్రభుత్వం ఏ ఉద్దేశ్యంతో అయితే మా నియామకాలను చేపట్టిందో.. దాన్ని తూచ తప్పకుండా పాటిస్తాం. అంకితభావంతో పనిచేసి ప్రభుత్వం అప్పగించిన పనిని బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తాం.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పాల్వంచ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జన ఊరేగింపు సందర్భంగా ఇరువర్గాలు ఘర్షణకు దిగి పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ సంఘటన రంగాపురంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకోగా అది కాస్తా ఆదివారం పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. ఎస్ఐ సురేష్ కథనం ప్రకారం రంగాపురం గ్రామంలో గణేష్ నిమజ్జనానికి స్థానికులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ ఊరేగింపులో డ్రస్‌కోడ్ విషయంలో మాజీ సర్పంచ్ హరి వర్గీయులకు, మరో స్థానికుడు రవి వర్గీయులకు భేదాభిప్రాయాలు వచ్చాయి. ఈ క్రమంలో స్వల్ప ఘర్షణ కాస్తా దాడులకు దారి తీసింది. ఇరు వర్గాల వారు పరస్పరం భౌతిక దాడులకు పాల్పడ్డారు. అనంతరం ఇరు వర్గాలవారు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ కొనసాగుతుందని ఎస్ఐ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

కారేపల్లి సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లగూడెం గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన గడిపర్తి శ్రీనివాసరావు మృతిఘటనలో ఇరువురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.గోపి తెలిపారు. మృతుడి భార్య గడిపర్తి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తలిపారు. తన భర్త గడిపర్తి శ్రీనివాసరావు మృతికి ఇల్లెందు మాజీ మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, అతని సోదరుడు ప్రసాద్‌లే కారణమంటూ రమ తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణ పార్టీల వ్యవహారం కాదు..

(5వ పేజీ తరువాయి)

మెజారిటీ స్థానాలు ఎన్డీయే నెగ్గడంలో ఆశ్చర్యం లేదన్నారు. దేశంలో ఇంతవరకు ప్రొవిషనల్, ఫైనల్ ఓట్ల శాతాలలో 2 శాతం కంటే ఎప్పుడూ వ్యత్యాసం లేదన్నారు. మొన్న యూపీలో ఈ వ్యత్యాసం 2 శాతం మాత్రమే ఉంటే ఎన్డీయే సీట్లు తగ్గాయన్నారు. ఎన్నికల సంఘం మహా మాయాజాలం వల్ల.. ఎన్నికల ఫలితాల తర్వాత పోలింగ్ శాతాన్ని ప్రకటించడం జరుగుతుందన్నారు. సుప్రీం కోర్టు అడిగినా సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం కాదు.. ప్రభుత్వమే ఓటర్లని సెలెక్ట్ చేసుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నెమ్మదిగా ప్రజలకు ఓట్ల చోరీని అలవాటు చేస్తోందని.. ప్రజలు మేల్కొనకపోతే భవిష్యత్తు అంధకారమై పోతుందన్నారు. హిందూ రాజ్యం స్థాపిస్తామంటే జనసంఘ్ పార్టీకి వచ్చిన ఓట్లు అత్యధిక శాతం 9 .5 శాతమని అన్నారు. ఇప్పుడు అవినీతి, ఎమర్జెన్సీ పేరుతో అనేక ప్రతిపక్షాల సహకారంతో నెమ్మదిగా అధికారంలోకి వచ్చినవాళ్లు.. ఆ తర్వాత తప్పుడు ఓట్లతో వాళ్ల హిందూ ఎజెండాను ముందుకు తీసుకొస్తున్నారన్నారు. ఈ దేశం ఆత్మ ఎన్నికల ప్రజాస్వామ్యంలో ఉందని, దీన్ని ఖమ్మం ప్రజలు వదలకుండా పోరాడాలన్నారు. అనంతరం పలువురు అడిగిన ప్రశ్నలకు ప్రభాకర్ సమాధానాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాధ్, ప్రత్యామ్నాయ పౌర సమూహం నాయకులు పాల్గొన్నారు.

గణపతి లడ్డూను దక్కించుకున్న ముస్లిం యువకుడు


లడ్డూతో ముస్లిం యువకుడు ఇమామ్

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా నిర్వహించే లడ్డు వేలంపాటలో ఓ ముస్లిం యువకుడు పాల్గొని లడ్డూను దక్కించుకున్నాడు. శనివారం రాత్రి ఇల్లెందు పట్టణంలోని నిర్వాసితకాలనీ 12వ వార్డులో నిర్వహించిన లడ్డు వేలం పాటలో ఇమామ్ అనే ముస్లింకు యువకుడు లడ్డు వేలంలో పాల్గొని రూ.49,116లకు లడ్డూను దక్కించుకున్నాడు.

శరీర కదలికలతో జబ్బులు నయం

మందుల కంటే 'థెరపీ'కే అధిక ప్రాధాన్యం
ఇందులో ఎనిమిది ముఖ్యమైన విభాగాలు
అందుబాటులో లేని ఫిజియోథెరపీ విద్య
'థెరపీ' కౌన్సిల్‌కు
ఆమోదం తెలిపిన డబ్ల్యూహెచ్‌వో
నేడు ప్రపంచ ఫిజియోథెరపిస్టు డే


క్రీడాకారుడి చేతికి థెరపీ చేస్తున్న డాక్టర్ వెంకన్న


విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు ప్రభాకర్‌రావు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/కల్లూరు, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన శరీర భాగాలలో కండరాలను కదిలిస్తూ జబ్బును నయం చేసే వైద్యమే ఫిజియోథెరపీ. ఆపరేషన్, మందులు లేకుండా వివిధ రకాల వ్యాయామాలతో (ఎక్సర్‌సైజు) ఆకస్మికంగా శరీరంలోని భాగాలకు వచ్చిన వ్యాధులను, ఏదైనా సమస్యను ప్రారంభ దశలో గుర్తించి సకాలంలో థెరపీ అందిస్తే జబ్బులు నయమవుతాయనే మాట ప్రాచుర్యం పొందింది. 'ముల్లును ముల్లుతోనే తీయాలని' నానుడి మాటలను నిజం చేసేలా నొప్పి ఉన్న ప్రాంతంలోని కండరాలను కదిలిస్తూ ఆ నొప్పిని తగ్గించేలా చేసే ప్రక్రియనే ఫిజియోథెరపీ. ఆధునిక యుగంలో ఆర్థోపెడిస్ట్‌నే ఫిజియోథెరపిస్ట్‌గా అభివర్ణిస్తున్నారు. ప్రారంభదశలో శరీర కండరాలలో ముఖ్యంగా ఎముకల్లో, కీళ్ళ నొప్పులు, ముఖ కదలికలు సంబంధించిన రోగాలకు బాధితులు ఫిజియోథెరపీని ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు. తక్కువ కాలవ్యవధిలోనే రోగాన్ని తగ్గించుకునేందుకు ఫిజియోథెరపిస్టుల వద్ద బారులు తీరి చికిత్స పొందుతున్నారు. ప్రస్తుత సమయంలో ప్రజలు పొందుతున్న వైద్యాలలో అత్యాధునిక సదుపాయాలతో ఫిజియోథెరపీకి కూడా ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో నేడు అంతర్జాతీయ ఫిజియోథెరపీ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

థెరపీలో ఎనిమిది ముఖ్యమైన విభాగాలు

ఫిజియోథెరపీలో ఆర్థోపెడిక్, కార్డియోథోరాసిక్, న్యూరాలజీ, స్పోర్ట్స్ మస్కిలో స్కెలెటన్, మాన్యువల్ థెరపీ, పీడియాట్రిక్స్ గైనకాలజీ, బిరియాట్రిక్స్ వంటి ఎనిమిది ప్రత్యేక విభాగాలుగా విభజించారు. ఎటువంటి మాత్రలు మింగకుండా నొప్పి మాయం కావాలంటే ఫిజియోథెరపీ వైద్యులను ఆశ్రయించి ఉపశమనం పొందుతారు. వివిధ దశల్లో ఈ వైద్యాన్ని పొందు తూ శాశ్వత పరిష్కారం లభిస్తుండడంతో అనేకమంది రోగులు ఫిజియోథెరపిస్టులను ఆశ్రయిస్తున్నారు. జీరో సైడ్ ఎఫెక్ట్‌తో కూడిన భారతీయ శాస్త్రీయ వైద్యవిధానమే ఫిజియోథెరపీ. ఈ ఫిజియోథెరపీని ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రోత్సహిస్తుంది. దేశంలో ఉన్న ప్రతి పీహెచ్‌సీలో ఒక ఫిజియోథెరపిస్టును నియమించుకోవాలని డబ్ల్యూహెచ్‌వో ప్రతిపాదనను అమలు చేస్తుంది. ఈ క్రమంలో దేశంలో కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే ఫిజియోథెరపిస్టులను భర్తీ చేసుకొని వారి సేవలను పొందుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో సర్వశిక్ష అభియాన్ పాఠశాలలో (ఎస్.ఎస్.ఎ) ఫిజియోథెరపిస్టులను భర్తీ చేసి సేవలు అందజేస్తున్నారు.

అందుబాటులో లేని ప్రభుత్వ ఫిజియోథెరపీ విద్య

ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూప్ పూర్తయిన విద్యార్థులు నీట్ లేదా ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు నాలుగున్నర సంవత్సరాల ఫిజియోథెరపీ కోర్సును వరంగల్ కేఎస్‌ఆర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో 21 ప్రవేట్ కళాశాలలో ఈ థెరపీ విద్య అందిస్తున్నారు. ఈ విద్యను ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేయకపోవడంతో ఫిజియోథెరపిస్టుగా స్థిరపడాలనుకున్న విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీ క్రీడాకారుడు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించాలన్నా అందులో ఫిజియోథెరపిస్టు పాత్ర ఎంతో కీలకంగా మారింది. వ్యక్తిగత, సభ్యులతో కూడిన ఏదైనా జట్టు క్రీడాకారులు తప్పని సరిగా ఒక ఫిజియోథెరపిస్టును నియమించుకుంటేనే పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారు.

ఫిజియోథెరపీ కౌన్సిల్‌కు ఆమోదం తెలిపిన డబ్ల్యూహెచ్‌వో

ఫిజియోథెరపీలకు కౌన్సిల్ ఏర్పాటుచేయాలని ఎన్నో ఏళ్ళ పోరాటం ఈనెల 2వ తేదీన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆమోదం తెలపడంతో ఫిజియోథెరపీ విద్యకు మంచి రోజులు వచ్చాయని ఫిజియోథెరపిస్టులు సంబురాలు జరుపుకున్నారు. ఈ క్రమంలో ఫిజియోథెరపీ ఫెడరేషన్ కౌన్సిల్ ఆమోదంపొంది భారతదేశంలో ఫిజియోథెరపీ నేషనల్ కమిషన్ ఫర్ అలైడ్, హెల్త్‌కేర్ ప్రొఫెషనల్ కౌన్సిల్‌గా ఆవిర్భవించింది. దీంతో ప్రతీ జిల్లాకు ఒక ఫిజియోథెరపిస్టు జిల్లా అధికారిని, ప్రతీ క్రీడా అసోసియేషన్‌కు ఒక ఫిజియోథెరపిస్టును నియమించుకోవాలని ప్రతిపాదనలు ప్రభుత్వాలు సిద్ధం చేసి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తుంది.

ఆదరిస్తే థెరపీ వైద్యసేవలు విస్తృతం చేస్తాం

కొత్తగూడెం ఫిజియోథెరపిస్టు జె.వెంకన్న



ఫిజియోథెరపీ విద్యను ప్రోత్సహిస్తూ ఆదరిస్తే వైద్యసేవలు రాబోయే రోజుల్లో విస్తృతం అవుతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు థెరపీ విద్యను ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేసి అందిస్తే గ్రామీణస్థాయి వరకు అందుతుంది. ఎక్కువ శాతం మంది క్రీడాకారులు గ్రామీణ నేపథ్యంలో ఉండడంతో ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి అవగానే ఉపాధి అవకాశాలు పొంది జీవితంలో స్థిరపడే అవకాశం ఉంటుంది.

భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ వైద్య సేవలు

డాక్టర్ మాగంటి ప్రభాకర్‌రావు, పీటీ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో 20 ఏళ్లుగా రాజీవ్ విద్యామిషన్ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భవిత కేంద్రాల ద్వారా పిల్లలకు ఫిజియోథెరపీ వైద్య సేవలు అందిస్తున్నారు. కల్లూరుకు చెందిన ఫిజియోథెరపిస్టు మాగంటి ప్రభాకర్‌రావు 13ఏళ్లుగా వైద్యసేవలు అందిస్తూ ఎంతోమంది పిల్లలకు వైద్యం చేశారు. అంతేకాకుండా సామాజిక సేవతో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, నోటు బుక్స్‌లు ఉచితంగా అందిస్తూ మంచి గుర్తింపు పొందారు.

'డయాలసిస్' పనితీరుపై ఎమ్మెల్యే ఆరా

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన
ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
వార్డుల్లోని రోగులతో మాటామంతీ
'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన


ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మణుగూరులోని మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించి డయాలసిస్ కేంద్ర పనితీరుపై ఆరా తీశారు. 'డయాలసిస్‌కు వెలితే హెచ్‌ఐవీ..' 'తప్పెవరిదీ' 'బాధితుడికి న్యాయం చేసేది ఎవరు..?' అనే శీర్షికలతో ఆంధ్రజ్యోతి వరుస కథనాలకు స్థానిక ఎమ్మెల్యే పాయం స్పందించి ఆదివారం ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటా మంజునేకర్ సునీల్, ఆర్ఎంవో గౌరీ ప్రసాద్‌లతో మాట్లాడారు. డయాలసిస్ రోగికి హెఐవీ సోకిన విషయమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇకనైనా డయాలసిస్ రోగుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. బాధితుడికి తగిన న్యాయం చేసేందుకు సత్వర చర్యలను చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు డయాలసిస్ కేంద్రంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ కేంద్ర సిబ్బందికి సూచనలు సలహాలు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని పలు వార్డులను సందర్శించి రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవ హరిస్తూ మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన ఆహారాన్ని రోగులకు అందించాలని తెలిపారు. ప్రధానంగా వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి వేళలను తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నవీన్, గాండ్ల సురేష్, కూచిపూడి బాబు, త్రిమూర్తులు తరుణ్ రెడ్డి, వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

కాళేశ్వరంపై ప్రభుత్వం తప్పుడు విమర్శలు

బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాకేష్‌రెడ్డి

ఖమ్మం చర్చికాంపౌండ్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం, మంత్రులు తప్పుడు విమర్శలు సాగిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాళేశ్వరం కూలిపోతే మల్లన్న సాగర్ నీళ్ల ఎక్కడివని,హైదరాబాదుకు ఇస్తున్న తాగు నీరు ఎక్కడిదని ప్రశ్నించారు. కృష్ణా గోదావరి నీటిని తెలంగాణ సాగు భూలకు మళ్లించి పంటలు పండించాలనే ఉద్దేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు పుట్టిందన్నారు. తెలంగాణలో గోదావరి నీరు ప్రవహిస్తున్నా తాగేందుకు నీరు దొరకని పరిస్థితి అన్నారు. కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమం సమీపంలో 281 టీఎంసీల నీటి లభ్యత ఉండడంతో తుమ్మిడిహట్టి నుండి మేడిగడ్డకు తరలించడం జరిగిందన్నారు. మేడిగడ్డ వద్ద రెండు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు కూలినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కాళేశ్వరంపై అపోహలు సృష్టించి కాంగ్రెస్ బురద రాజకీయం చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రసాధన తర్వాత బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన అన్ని ప్రాజెక్టులు పటిష్టంగా ఉన్నాయని తద్వారా తెలంగాణ భూభాగం సస్యశ్యామలం అయిందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలోని మంత్రులు పదేపదే కాళేశ్వరంపై విమర్శించడం తగదని తెలిపారు. ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు కేసీఆర్ భక్తరామదాసు, సీతారామ ప్రాజెక్టులను నిర్మించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు బిచ్చాల తిరుమల రావు, డోకుపర్తి సుబ్బారావు, మందడపు శంకరరావు, పగడాల నరేందర్, కొండల్‌రావు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని చాటుకున్న ముస్లిం యువకుడు

వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న రఫి


వేలంపాటలో లడ్డూ దక్కించుకున్న రఫి దంపతులు

పెనుబల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా ఖమ్మంజిల్లా పెనుబల్లి బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న పదికిలోల లడ్డూ ప్రసాదాన్ని అదే కాలనీకి చెందిన ముస్లిం దంపతులు దక్కించుకొని మతసామరస్యాన్ని చాటుకున్నారు. పెనుబల్లి బీసీ కాలనీలో హిందువులతో పాటు ముస్లింలు కూడా అధికంగా నివాసముండే ప్రాంతం. ఈ ప్రాంతంలోని యువకులు 15 ఏళ్లుగా వినాయక చవితి సందర్భంగా విగ్రహాన్ని ప్రతిష్టించి నవరాత్రులు పూజలు చేసి లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహిస్తుంచారు. ఈసారి కూడా అదేవిధంగా పూజలు నిర్వహించి లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించారు. లడ్డూ వేలంలో షేక్.రఫి రూ.8500లకు దక్కించుకున్నాడు. దీంతో హిందూ ముస్లింలు కలిసి వినాయక నవరాత్రుల్లో పాలుపంచుకోవడంతో మతసామరస్యం వెల్లివిరిసింది. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

పాత కక్షల నేపథ్యంలో దాడి

చింతకాని, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నరసింహపురం గ్రామానికి చెందిన నాటురాయి వెంకట్రావ్, అతని భార్య అనూషపై పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని అదే గ్రామానికి చెందిన నాటురాయి అజయ్, జల్లి వినోద్, జల్లి నానీలు శనివారం రాత్రి దాడి చేశారు. అజయ్ చేతికి ఉన్న కడియంతో వెంకట్రావ్‌పై దాడి చేయడంతో చెవి భాగంలో గాయమైంది. ఘటనపై వెంకట్రావ్ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల కాపరిపై దాడి.. కేసు నమోదు

చింతకాని, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచకు చెందిన మాగం కిషోర్ అనే గొర్రెల కాపరిపై సీతంపేటకు చెందిన లింగయ్య, వెంకటేశ్వర్లు శనివారం దాడి చేసి గాయపర్చాడు. ఇద్దరి మధ్య మేకల పంపకం విషయంలో గత కొంతకాలంగా వివాదం నెలకొంది. బాధితుడి ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

విశ్రాంత ఉద్యోగుల స్వర్ణోత్సవ వేడుక

ఖమ్మం చర్చికాంపౌండ్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): 1975 బ్యాచ్‌కు చెందిన రెవెన్యూ విభాగం విశ్రాంత ఉద్యోగుల స్వర్ణోత్సవ వేడుక ఆదివారం ఖమ్మం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన అతిధులు మాట్లాడుతూ 50ఏళ్ల క్రితం మొదలైన ప్రయాణం కేవలం ఉద్యోగ పరిమితుల్లోనే కాకుండా మానవ విలువలు, స్నేహబంధం, పరస్పర సహకారానికి నిదర్శనంగా నిలిచిందన్నారు. ఈ బంధం ఎల్లప్పుడు ఇలాగే కొనసాగాలని కోరారు. తమ 50ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఏర్పడిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఇ.రామారావు, మురళీకృష్ణ, సుధాకర్, సుబ్బయ్య, సైదయ్య, బసవరాజు ఉపేందర్‌రావు పద్మనభారెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

'ఖరీఫ్'కి పెదవాగు పనులను పూర్తి చేయండి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


నీటి పారుదల అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. అశ్వారావుపేట డివిజన్-2 నీటిపారుదలశాఖ ఈఈగా బాధ్యతలు చేపట్టిన బి.కృష్ణ మంత్రి తుమ్మలను ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఈఈ కృష్ణను అభినందిస్తూ పెదవాగు ప్రాజెక్టు మరమ్మతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితులలో ఖరీఫ్ సీజన్ నాటికి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం పూర్తయిన అనంతరం చెరువుల మరమ్మతులను పూర్తిచేయాలని పెద్ద చెరువులపై నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. డివిజన్ పరిధిలో చెరువుల నీటి లభ్యత, ప్రస్తుత చెరువుల పరిస్థితిపై ఆరా తీశారు. అశ్వారావుపేటలోని దొంతికుంట చెరువును ప్రక్షాళన చేసి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పట్టణంలో వేస్ట్ వాటర్‌ను చెరువులోకి కలువకుండా బయటకు పోయే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. వేంసూరు మండలం కుంచపర్తికి చెందిన పలువురు రైతులు తుమ్మలను కలిసి గ్రామరాశి కింద 120 ఎకరాలకు పైగా భూమి ఆక్రమణలో ఉందని, దానిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి ఖమ్మం జాయింట్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి భూసమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వాసం రాణి మంత్రి తుమ్మలను కలిసి దమ్మపేట వ్యవసాయమార్కెట్ కమిటీ మరమ్మతులకు, ములకలపల్లిలో మార్కెట్ యార్డుకు సీసీ రోడ్డు నిర్మాణానికి వ్యవసాయమార్కెటింగ్ ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసారు. పాల్వంచ చెందిన పలువురు నాయకులు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు తుమ్మలను కలిసి వినతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి రాంచంద్రప్రసాదు, దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, పైడి వెంకటేశ్వరరావు, కాసాని నాగప్రసాదు, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు తదితరులు ఉన్నారు.


మంత్రిని కలిసిన పాల్వంచకు చెందిన నాయకులు

వ్యవసాయాన్ని నిలబెట్టేలా.. విద్యార్థులు తయారు కావాలి

గంగారంలోని మంత్రి తుమ్మల
వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన
రాజేంద్రనగర్ విద్యార్థులు
పలు రకాల పంటలపై
విద్యార్థులకు అవగాహన
స్టూడెంట్స్‌తో ప్రత్యేకంగా
సమావేశమైన మంత్రి తుమ్మల


విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవిష్యత్‌లో వ్యవసాయానికి ఎంతో ప్రాధాన్యత లభించనుందని, వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులంతా అన్నదాతకు, వ్యవసాయానికి అండగా నిలబడేలా తయారుకావాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. హైదరాబాదులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన యూనివర్సిటీకి చెందిన నాల్గో సంవత్సరం విద్యార్థులు 100మంది ఆదివారం సాయంత్రం అశ్వారావుపేట మండలంలోని గంగారంలో గల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా వ్యవసాయ క్షేత్రంలోని పామాయిల్, కోకో, వక్కతో పాటు ఇతర అంతర పంటలను పరిశీలించారు. విద్యార్థులకు శాస్త్రవేత్తలు పలు అంశాలను వివరించారు. అనంతరం స్వయానా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈప్రాంతం ఉద్యాన పంటలకు పెట్టింది పేరని, ఉద్యాన పంటలతో రైతులకు ఆర్థిక భరోసా ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు కూడా రైతులకు ఎటువంటి పంటలు వేస్తే ఎంత ఆర్థికంగా బలపడవచ్చో వివరిస్తూ ఉండాలని తెలిపారు. ఎంతో భవిష్యత్ ఉన్న విద్యార్థులు వ్యవసాయాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫాం ఓఎస్‌డీ కిరణ్, వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ హేమంత్‌కుమార్, రవి సీడ్స్ అధినేత రవి, పలువురు శాస్త్రవేత్తలు, పార్టీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అక్రమ ఇసుక

అదుపు తప్పి గోతిలోకి దూసుకెళ్లిన ఇసుక ట్రాక్టర్
ఇసుక మీద పడడంతో డ్రైవర్ మృతి


డ్రైవర్ పాషా మృతదేహం

గుండాల, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): కిన్నెరసాని వాగు నుండి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలోకి దూసుకెళ్లడంతో చెట్టు కొమ్మలు తగిలి కిందపడిన డ్రైవర్‌పై ఇసుక పడటంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం గుండాల మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఎస్కే పాషా(55) సిమెంట్ ఇటుకల తయారీ పనుల కోసం సాయనపల్లి సమీపంలోని కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తీసుకువచ్చేందుకు ట్రాక్టర్‌తో వెళ్లాడు. ఇసుక లోడు చేసుకొని వచ్చే క్రమంలో సాయనపల్లి-గుండాల మార్గ మధ్యలో దేవరచింత వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను చూసి ట్రాక్టర్ వేగాన్ని అదుపు చేయడానికి బ్రేక్ వేశాడు. అయితే కలిపి ఉండవల్సిన బ్రేక్‌లు విడదీసి ఉండటంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గోతిలోకి ట్రాక్టర్ దూసుకెళ్లింది. దీంతో ఆ గోతిలోని చెట్లకొమ్మలు బలంగా తగలడంతో డ్రైవర్ కిందపడిపోయాడు. ఈ క్రమంలోనే ట్రక్కులోని ఇసుక అతనిపై పడటంతో ఊపిరాడక మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ఘటనలు

కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను ఇష్టానుసారంగా అక్రమ రవాణా చేస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

వాగులో పడి పశువుల కాపరి మృతి

దుమ్ముగూడెం, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ వాగులో పడి పశువుల కాపరి మృతిచెందిన సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. చినబండిరేవుకు చెందిన పెనుగొండ వెంకన్న(63) గేదెలను మేపేందుకు సహచర కాపరులతో కలిసి చినగుబ్బలమంగి వాగు వైపుకు వెళ్లాడు. కొన్ని గేదెలు వాగుదాటి అవతల ఒడ్డుకు వెళ్లగా, వాటిని తిరిగి వెనక్కి మరల్చేందుకు వాగులోకి దిగాడు. లోతు అంచనా వేయలేక నీట మునిగి గల్లంతయ్యాడు. గజ ఈతగాళ్లు, గ్రామస్థులు కలిసి వాగులో వెతగ్గా.. మృతదేహం లభించింది. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్‌హెచ్‌వో టి.వెంకటప్పయ్య కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

తల్లాడ, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మల్లవరానికి చెందిన పశువుల కాపరి పూల చిన్ననాగయ్యపై దాడికి పాల్పడిన అన్నారుగూడెంకు చెందిన ఆటోడ్రైవర్ సుంకర ఉపేందర్‌పై ఆదివారం తల్లాడ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయింది. చిన్ననాగయ్య గేదెలను మేత కోసం వెళుతుండగా ఆటోకు గేదెలను తగిలిస్తావా అంటూ ఉపేందర్ దాడికి పాల్పడ్డాడు. ఈమేరకు చిన్ననాగయ్య ఫిర్యాదు చేయడంతో ఉపేందర్‌పై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కలుపుమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు కలుపుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సత్తుపల్లి మండలం సిద్దారంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోరంపూడి మాధవరావు (68) భార్య సరోజినీతో కలిసి చిన్న బడ్డీకొట్టు నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైన మాధవరావు శనివారం ఇంటిలో కలుపు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మాధవరావు కుమార్తె గాదె సత్యవాణి ఫిర్యాదు మేరకు ఏఎస్సై ప్రతాపరెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రొటోకాల్ రగడ

అసెంబ్లీ స్పీకర్ వరకు వెళ్లిన లొల్లి..
ఉపాధ్యాయ దినోత్సవ సాక్షిగా అధికారుల మధ్య సమన్వయ లోపం


ఉపాధ్యాయ వేడుకల ఆహ్వాన పత్రిక

కొత్తగూడెం కలెక్టర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రొటోకాల్ లొల్లి అసెంబ్లీ స్పీకర్ వరకు వెళ్లినట్లు తెలిసింది. సాధారణంగా జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యేలు అధ్యక్షులుగా వ్యవహరించడం ఆనవాయితీగా వస్తోంది. అందుకు భిన్నంగా అశ్వారావుపేట ఎమ్మెల్యేను అధ్యక్షుడిగా ఆహ్వానపత్రంలో పేర్కొనడంతో అదిచూసిన స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధికారులను తీవ్రస్థాయిలో మందలించడమే కాకుండా ఏకంగా ఉపాధ్యాయ దినోత్సవానికి రావడానికి నిరాకరించినట్లు తెలిసింది. ఆహ్వాన పత్రిక రూపకల్పనలో విద్యాశాఖలోని షాడో డీఈవో ఒంటెద్దు పోకడ వల్ల ఉద్యోగుల్లో సమన్వయ లోపం ఏర్పడింది. అధికారులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడం.. కిందిస్థాయి ఉద్యోగులను గుడ్డిగా నమ్మడం వల్ల ఆహ్వాన పత్రికలోనే తప్పులు దొర్లాయి. అంతేకాకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడంపైనా ఉద్యోగుల్లో తీవ్ర విమర్శలు చోటుచేసుకున్నాయి. చివరకు ఇన్‌చార్జ్ డీఈవో బి. నాగలక్ష్మి.. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దగ్గరకి వెళ్లి మళ్లీ ఇలాంటివి జరగకుండా చూస్తామని బతిమిలాడటంతో వివాదం సద్దుమణిగింది. అయితే అసలు ఆహ్వానపత్రిక సూత్రదారి ఎవరు అని ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో మండిపడ్డట్లు తెలిసింది. ఏది ఏమైనా విద్యాశాఖ రూటే వేరు..!

విధుల నుంచి ఖాజీ రషీద్ ఖాన్ తొలగింపు

రాష్ట్ర కమిషనర్ ఉత్తర్వులు
కొత్తగూడెంలో మీడియా సమావేశంలో ఏఎస్‌జే సభ్యులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): ఖాజీగా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ అబ్దుల్ రషీద్‌ఖాన్ అనుచిత ప్రవర్తన, చట్ట విరుద్ధమైన కార్యకలాపాలు కొనసాగిస్తున్న వాటిని పరిగణనలోకి తీసుకొని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారు విధుల నుంచి తొలగిస్తూ అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేసినట్లు అహలే సున్నంత్ వలె జమాత్ (ఏఎస్‌జె) సభ్యులు తెలిపారు. ఆదివారం కొత్తగూడెం పట్టణంలోని ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఏఎస్‌జె సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను చూపుతూ మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. కొత్తగూడెంతో పాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు ఏడు మండలాలు, మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఖాజీగా కొనసాగుతున్న రషీద్‌ఖాన్‌ను జీవో నెంబర్ 72 ప్రకారం విధుల నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. ఖాజీగా చేసిన పనులను సేకరించి లిఖితపూర్వకంగా భద్రాద్రి జిల్లా కలెక్టర్, జిల్లా మైనార్టీ శాఖ అధికారులకు తెలంగాణ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్‌కు ఏఎస్‌జె , వివిధ మసీదు కమిటీ సభ్యులు అందజేశారు. ఈ క్రమంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు కొత్తగూడెం తహసీల్దార్‌కు జిల్లా కలెక్టర్ విచారణ చేయమని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ విచారణ పూర్తి చేసి నివేధికను కలెక్టర్‌కు, మైనార్టీ ఉన్నతాధికారులకు అందజేయగా ఖాజీగా కొనసాగుతున్న రషీద్‌ఖాన్‌పై వేటు వేస్తూ తొలగిస్తూ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. యావత్ జిల్లా ముస్లిం సమాజం ఈ విషయాన్ని గ్రహించాలని, ఎటువంటి సమస్యలు ఉన్న మజీద్ ఇమామ్‌లను సంప్రదించాలని సూచించారు.ఈ సమావేశంలో ఏఎస్‌జె జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.కరీంఖాదీరి, కార్యదర్శి ఎండి.హుస్సేన్‌ఖాన్, ఉపాధ్యక్షులు ఎండి గౌస్‌మోహినుద్దీన్, చైర్మన్ ఎమ్.ఎ.రజాక్, సభ్యులు అలీముద్దీన్, షమ్మీ, నిసాత్, అమీర్‌అహ్మద్, నయీమ్, ఎండి దావూద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత జీయావుద్దీన్ కన్నుమూత


నివాళులు అర్పిస్తున్న సీపీఎం జాతీయ నాయకులు సాయిబాబు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఉమ్మడి తెలుగు రాష్ట్రల మాజీ కోశాధికారి (ట్రెజరర్), సీపీఎం సీనియర్ నాయకుడు జీయావుద్దీన్(76) శనివారం రాత్రి గుండె సంబంధిత వ్యాధితో కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆదివారం ఆయన భౌతికకాయాన్ని ఖమ్మం సీపీఎం జిల్లా కమిటీ కార్యాలయం అయిన సుందరయ్య భవన్‌కు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, పొన్నం వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బారావు, బుగ్గవీటి సరళ, సాయిబాబు తదితరులు జీయావుద్దీన్ భౌతిక కాయంపై పూలదండలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఆదర్శంగా పనిచేశారని, ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు చేస్తూ విద్యార్థులను మంచి పౌరులుగా మార్చేందుకు తనవంతు ప్రయత్నం చేశారన్నారు. జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడిగా పనిచేసిన కాలంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సమస్యలపై గళమెత్తారని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేశారన్నారు. తన కుటుంబ సభ్యులను క్రమశిక్షణ గల పార్టీ కార్యకర్తలుగా ఆదర్శంగా నిలిపారని తెలిపారు. ఈ సందర్భంగా జీయావుద్దీన్ కుమారుడు జావీద్‌ను పలువురు నాయకులు పరామర్శించారు. అనంతరం భౌతికకాయాన్ని జీయావుద్దీన్ స్వగ్రామం అయిన తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్‌కు తరలించారు.

స్థానిక సంస్థల ఓటరు జాబితాపై నేడు సమావేశం

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఓటరు జాబితాపై సోమవారం గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. స్థానిక సంస్థలైన ఎంపీటీసీ, జడ్పీటీసీ వారీగా ఓటర్ జాబితా పోలింగ్ స్టేషన్ల జాబితా విడుదల చేయాలని రాష్ట్రఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సాయంత్రం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ముందస్తు ఏర్పాట్లతో సఫలీకృతం

- ప్రశాంతంగా ముగిసిన వినాయక మహానిమజ్జనం
- పక్షంరోజుల పాటు కేఎంసీ అధికారుల ఏర్పాట్లు
- పాలకవర్గానికి ప్రశంసలు





పనులు పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య, సూచనలు ఇస్తున్న మేయర్ నీరజ(ఫైల్)

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా ముగియటంతో ఖమ్మం నగర పాలక సంస్థ పాలకవర్గం, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక వైపు పూటకో రకంగా మారుతున్న వాతావరణం, ఎగువ ప్రాంతాల్లో వర్షాలకు వరదలు పోటు పెరగటంతో అధికారులు కొంత ఆందోళనకు గురయ్యారు. అధికారులు పక్షం రోజులుగా పడిన శ్రమ, ముందు చూపుతో వ్యవహరించిన తీరు భక్తులకు మంచి సౌకర్యాలను కల్పించింది. మహానిమజ్జనం సందర్భంగా చిన్న పాటి సంఘటనలు చోటు చేసుకోకుండా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీసు కమిషనర్ సునీల్‌దత్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య విస్తృత ఏర్పాట్లు చేశారు. దీంతో ఖమ్మం నగర పాలక సంస పాలకవర్గానికి స్థానిక ప్రజలతో పాటుగా రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు వరకు మన్ననలు పొందారు.

వరద పెరిగినా ఇబ్బందిలేకుండా..

సెప్టెంబరు 1వ తేది వరకు మున్నేరు వరద తీవ్రత 9అడుగులు ఉండటంతో ఆ మేరకు గణపయ్య నిమజ్జనఘాట్‌లు ఏర్పాట్లు చేశారు. కాగా సెప్టెంబరు3న మున్నేరు 15అడుగులకు చేరింది. దీంతో అధికారులు ఏర్పాటు చేసిన ఘాట్‌లు, ర్యాంపులు, రహదారులు నిమజ్జన ఘాట్‌లు కొట్టుకు పోయాయి. అయినా మరో సారి అధికారులు ఏర్పాట్లు చేశారు. మున్నేరుకు 15అడుగుల పైభాగం నుంచి నిమజ్జనానికి తిరిగి ఏర్పాట్లు చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య నిత్యం ఉదయం, సాయంత్రం సమయాల్లో మున్నేరు పరివాహకంలోని కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ ఘాట్‌లను సందర్శించారు. ఈఈ కృష్ణలాల్‌కు పూర్తి స్థాయిలో అక్కడే విధులు కేటాయించి పనులు అప్పగించారు. నిమజ్జనం రోజున ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ క్రెయిన్లు, యంత్రాలను తెప్పించారు. భక్తులు మున్నేరు నీటిలోకి వెళ్లకుండా మైదాన ప్రాంతంలోనే కట్టడి చేశారు. భక్తులు తరలించిన గణేష్‌విగ్రహాలను భారీ క్రెయిన్లతో వాహనాల నుంచి బయటకు తీసి భక్తుల సమక్షంలోనే మున్నేరులో నిమజ్జనం చేశారు. కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్‌తో పాటుగా ధంసలాపురం, పుట్టకోటలోను నిమజ్జన ఘాట్‌లను ఏర్పటు చేసి స్థానికంగా ఉన్న గణపయ్య విగ్రహాలను అక్కడే నిమజ్జనం చేశారు. ఆయా ప్రాంతాల్లోను గజీతగాళ్లను, యాంత్రాలను అందుబాటులో ఉంచారు.

నిమజ్జన ఏర్పాట్లు ఇలా..

యంత్రాలు	కాల్వొడ్డు..	ప్రకాశ్‌నగర్
360డిగ్రీల క్రేయిన్లు	2	0
ఉక్కు క్రేయిన్లు	1	1
క్రేయిన్లు	11	4
లాంగ్ జేసీబీలు	1	1
గజ ఈతగాళ్లు	250	50
ఫ్లడ్‌లైట్లు	270	170
సీసీ కెమెరాలు	14	8



పత్తి రైతు పరేషాన్

- దిగుబడిపై అన్నదాతల దిగాలు
- అధిక వర్షాలతో ఎర్రబారుతున్న పంట

కూసుమంచి,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు తెల్లబోతున్నారు. ఆరంభంలో వర్షాలు ముఖం చాటేయడంతో కొంత ఆందోళనకు గురయ్యారు. అనంతరం వర్షాలు ఆశాజనకంగా కురవడంతో పత్తిపంటకు జీవంపోసినట్లయింది. అయితే 20రోజులుగా తుఫాను ప్రభావంతో అధికవర్షాలు కురుస్తుండటంతో రైతులు పరేషాన్‌కు గురవుతున్నారు. పంట దెబ్బతిని దిగుబడిపై ప్రభావం చూపింది. అధిక వర్షాలతో పంటలో ఇసుక మేటలు వేయడం, మొక్కలు ఒరిగిపోవడం, ఆశించినస్థాయిలో మొక్కలు ఎదుగుదల లేకపోవడం,పూత, కాత దశలోపంట ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకులకు తెగుళ్ల సోకి ఎరుపు రంగులోకి, పసుపురంగులోకి మారుతున్నాయి. పూత, కాయలు రాలిపోతున్నాయి.ఖర్చులు పెరిగిపోతుండగా, కలుపు సమస్య సైతం రైతులను వెంటాడుతోంది. వర్షపునీరు ఊట వస్తుండటంతో నీరు నిల్వ ఉండటంతో కలుపు పెరగడంతో వాటిని తొలగించుకునేందుకు చేలల్లోకి వెళ్లలేకపోతున్నారు. ఎకరాకు సుమారు రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. వర్షాలు కారణంగా కనీసం ఒకటీ రెండు సార్లు మందులు పిచుకారీ చేయాల్సి ఉందని, మొక్కలు బలం లేకపోవడంతో దిగుబడి తగ్గుతుందేమోనని రైతులు భావిస్తున్నారు.





గంగబండతండాలో ఊటబట్టిన పత్తి, కూసుమంచిలో ఎర్రబారిన పత్తి

నీటిని తొలగించాలి: కూసుమంచి ఏవో వాణి

అధిక వర్షాలు కురవడంతో నీటిని సాధ్యమైనంత త్వరగా తీసివేయాలి. వీలైనంత త్వరగా తేమను తగ్గించేందుకు అంతరకృషి చేయాలి. పత్తి విత్తుకుని 25రోజుల దశ ఉన్న పంటకు ఎకరాకు 25కేజీల యూరియా, పదికిలోల పొటాష్ ఎరువులను మొక్కకు 5సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలి. అంతరసేద్యం సాధ్యం కానిచో ప్రొపక్విజలోఫాప్ 10శాతం ఈసీ 250 మిల్లీలీటర్లు ఎకరాకు పిచుకారీ చేయడం వల్ల గడ్డిని నివారించవచ్చు.

సీపీఎం నేత జియావుద్దీన్‌కు నివాళులు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): సీపీఎం సీనియర్ నేత, యూటీఎఫ్ జిల్లా నాయకుడు ఎస్‌డీ జియావుద్దీన్‌కు వివిధ పార్టీల నేతలు నివాళులర్పించారు. అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా, ఆయన భౌతికకాయాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకుడు రామసహాయం నరేష్‌రెడ్డి, ఉన్నం రాజశేఖర్, మాజీజడ్పీటీసీ బెల్లం శ్రీను, మాస్‌లైన్ నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, సీపీఎంనాయకులు ఎ.నరసయ్య, కె.శ్రీను తదితరులు నివాళులర్పించారు.

భూమిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదు

తిరుమలాయపాలెం,సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామానికి చెందిన రైతు ప్రతాపనేని విజయభూపాల్ ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వారసత్వంగా వస్తున్న భూమిలో ఇదే గ్రామానికి చెందిన పులిపలుపుల సుధాకర్ ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నాడని ఫిర్యాదులో వివరించారు. ఈ భూమిని కౌలుకు ఇస్తున్నానని, కౌలుదారుడిని కూడా వేధిస్తున్నట్లు పేర్కొన్నారు.

పోర్టుపోలియో న్యాయాధికారిని కలిసిన

జిల్లా బార్ అసోసియేషన్ కార్యవర్గం

ఖమ్మంలీగల్,సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ఆదివారం జిల్లా పోర్టుపోలియో న్యాయాధికారి శ్రీమతి జస్టిస్ మాధవిదేవిని ఖమ్మం బార్‌అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్తులో తాము నిర్వహించే సిల్వర్‌జూబ్లీ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. పలు సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గద్దల దిలీప్ కుమార్, మేకల నవీన్ పాల్గొన్నారు.



మాధవిదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా బార్ అసోసియేషన్ నాయకులు

ఆలయాల మూసివేత



ఖమ్మంరూరల్,సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం కారణంగా ప్రముఖ ఆలయాలు ఆదివారం మూత పడ్డాయి. రెడ్డిపల్లిలోని మారెమ్మతల్లి దేవాలయానికి అర్చకులు మూసివేశారు. మద్దులపల్లి, టీఎన్జీఓస్ కాలనీల్లో ఉన్న శివాలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం తెల్లవారు జామునఆలయ సంప్రోక్షణ అనంతరం సేవలు యధావిధిగా కొనసాగనున్నాయి.

పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో గణేషుడికి ఘన వీడ్కోలు

ఖమ్మంక్రైం,సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి):పోలీసుహెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి ఆదివారం నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు. గణేష్ నిమజ్జన వేడుకల్లో బందోబస్తు విధుల్లో పోలీసులు ఉండడంతో శనివారం కార్యక్రమం నిర్వహించలేక పోయారు. ఆదివారం నిర్వహించిన ఈ నిమజ్జన కార్యక్రమానికి సీపీ సునీల్‌దత్‌తోపాటు ఇతర అధికారులు హాజరయ్యారు. అనంతరం ప్రకాష్‌నగర్ మున్నేరు వద్ద గణేష్ నిమజ్జనం పూర్తిచేశారు.

నిమజ్జన వేడుకలకు ప్రశాంతంగా బందోబస్తు

నిమజ్జన వేడుకలకు పోలీసులు భారీబందోబస్తు ఏర్పాటుచేసి ప్రశాంతంగా నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వేడుకలు ముగిశాయి. దీంతో ఆదివారం ఉదయం ఆరున్నర గంటల వరకు ఆఖరి గణేష్ విగ్రహం నిమజ్జన పూర్తయ్యే వరకు పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించారు. కాల్వొడ్డు మున్నేరు వద్దకు ఆదివారం ఉదయం ఆరున్నరగంటల వరకు 505విగ్రహాలు, ప్రకాష్‌నగర్ మున్నేరుకు 261విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేసినట్లు తెలిపారు. నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో సీపీ సునిల్‌దత్ పోలీసు సిబ్బందిని అభినందించారు.



నిమజ్జన వేడుకలకు హాజరైన సీపీ



నిమజ్జనం అనంతరం మున్నేరువద్ద ఉన్న పోలీసు సిబ్బంది

మద్యం మత్తులో ఎస్‌ఐల విధులకు ఆటంకం

ముగ్గురు యువకులపై కేసు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): నిమజ్జన వేడుకల విధుల్లో ఉన్న ఇద్దరు ఎస్‌ఐలను మద్యం మత్తులో ఉండి ముగ్గురు యువకులు వారి విధులకు ఆటంకం కలిగించారు. ఈ ఘటన శనివారం రాత్రి ఖమ్మంలో జరిగింది. ఖానాపురం యూపీహెచ్‌కాలనీ ప్రాంతానికి చెందిన కొంతమంది యువకులు గణేష్ విగ్రహ నిమజ్జనానికి శనివారం బయలుదేరారు. రాత్రి11:30 అయినా డీజే పాటలకు డ్యాన్సులు వేస్తూ వాహనం కదలనివ్వకుండా డ్యాన్సులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో ఉన్న ఖానాపురంహవేలి ఎస్‌ఐ మధుకుమార్ అక్కడికి వెళ్లి డీజే వాహనాన్ని పంపించారు. విగ్రహ వాహనాన్ని నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్లాలని చెబుతున్నా.. వినకుండా తుపాకుల మహేష్, చల్ల మాధవరావు, బాలు ఎస్‌ఐను నెట్టివేశారు. అదేసమయంలో అక్కడికి వచ్చిన మరో ఎస్‌ఐ శ్రావణ్ మాట్లాడుతుండగా ఆయన్నుకూడా నెట్టివేశారు. వెంటనే ఎస్‌ఐలు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. విధులకు ఆటంకం కలిగించటమే కాకుండా వారిని నెట్టిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

ఆరంభ శూరత్వంగా.. మిర్చి కొనుగోళ్లు

- కొనుగోళ్లకు అడ్డుపడుతున్నదెవరో?

వైరా,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు ఆరంభ సూరత్వంగా మారాయి. ఇక్కడ మిర్చి కొనుగోళ్లు జరుగకుండా ఒకరిద్దరు తమ పలుకుబడితో అడ్డుకుంటున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈఏడాది జూన్ 16న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఏఎంసీలో మిర్చి కొనుగోళ్లు ప్రారంభించారు. ఆతర్వాత ఒక్క మిర్చి బస్తా కొనుగోలు కూడా ఇక్కడ జరుగలేదు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.లక్ష్మణుడు వైరా వచ్చి ఈ ప్రాంతంలోని మిర్చి వ్యాపారులు, కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులతో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసి అభిప్రాయాలు సేకరించారు. ఖమ్మం మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. మిర్చి కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మిర్చి కొనుగోళ్లను ప్రారంభించారు. అయినప్పటికీ ఇంతవరకు అతీగతీ లేదు.

వైరా మార్కెట్‌యార్డు పరిధిలో 13కోల్డ్‌స్టోరేజీలు..

వైరా వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాలున్నాయి. ఈ మూడు మండలాల్లో 13దాకా కోల్డ్‌స్టోరేజీలున్నాయి. అత్యధికంగా తల్లాడ మండలంలో ఆతర్వాత కొణిజర్ల, వైరా మండలాల్లో కోల్డ్‌స్టోరేజీలు పనిచేస్తున్నాయి. అయితే వైరా మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు చేయకుండా కోల్డ్‌స్టోరేజీల వద్దనే వ్యాపారులు మిర్చి కొనుగోళ్లు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు. తల్లాడ నుంచి వైరాకు కేవలం పదికిలోమీటర్లు, కొణిజర్ల నుంచి ఎనిమిదికిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వైరా మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు చేస్తే రైతులకు కొంత గిట్టుబాటు ధర లభిస్తుంది. ఉదాహరణకు మధిర మార్కెట్ యార్డు పరిధిలో కోల్డ్‌స్టోరేజీలు 20కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అయినప్పటికీ అక్కడ విధిగా మార్కెట్‌యార్డులోనే మిర్చి లాట్లు పెట్టి వ్యాపారులు రైతుల నుంచి మిర్చి కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే వైరా మార్కెట్‌యార్డు పరిధిలో కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చిని తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు.

కొనుగోలు సౌకర్యాలకు కొదవలేదు..

ఈమార్కెట్‌యార్డులో ఐదు ఓపెన్ షెడ్లు, నాబార్డు, నాన్‌నాబార్డు నిధులతో నిర్మించిన దాదాపు 15వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు, మార్కెట్ సిబ్బంది, హమాలీలు అందుబాటులో ఉన్నారు. ఇక్కడ రైతులకు కావల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయినప్పటికీ మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు జరగడం లేదు.

ఆదాయాన్ని కోల్పోతున్న మార్కెట్..

కోల్డ్‌స్టోరేజీల వద్దనే మిర్చి క్రయ, విక్రయాలు జరుగుతున్నందున సెస్ రూపేణా రావల్సిన రూ.కోటికి పైగా ఆదాయాన్ని మార్కెట్ కోల్పోతుంది. గతంలో కేవలం చెక్‌పోస్టుల వద్ద మిర్చికి సంబంధించి సెస్ రూపేణా రూ.60నుంచి రూ.70లక్షల వరకు మార్కెట్‌కు ఆదాయం లభించేది. ఇప్పుడు కోల్డ్‌స్టోరేజీల వద్దనే రైతుల నుంచి వ్యాపారులు తక్కువ ధరకు మిర్చి కొనుగోళ్లు చేసి పక్కదారి పట్టిస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దాంతో చెక్‌పోస్టుల ద్వారా రావల్సిన సెస్‌ను కూడా మార్కెట్ కమిటీ నష్టపోతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏడాదికి రూ.కోటికి పైగానే మార్కెట్ కమిటీ ఆదాయాన్ని కోల్పోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు మిర్చి సాగుచేస్తున్నారు. ఈ సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం రైతులు కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చిని అయినకాడికి తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. అక్టోబరు వరకు కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చిని రైతులు పెట్టుబడుల కోసం విక్రయిస్తూనే ఉంటారు. అసలే ఈ ఏడాది మిర్చి ధర భారీగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చిని వ్యాపారులు అడిగిన తక్కువ ధరకు విక్రయిస్తూ మరింతగా నష్టపోతున్నారు. అందువల్ల మార్కెట్‌లో కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టపరిహారం అందించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సురేష్

ఖమ్మంరూరల్, సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏదులాపురంలో ఆదివారం జరిగిన రైతుసంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.క్వింటాకు రూ.10.075 మద్దతు ధరను పత్తికి చెల్లించాలన్నారు. యూరియా సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈనెల 10న రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) ఆధ్వర్యంలో జరిగే సదస్సును విజయవంతం చేయాలన్నారు. ఈసమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, వెంకన్న, శంకర్‌రెడ్డి, నాగయ్య,రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో అవకతవకలు

టీఎస్ యూటీఎఫ్



ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం ఎంపిక చేసిన జాబితా తప్పులు తడకగా ఉందని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ విమర్శించింది. ఆదివారం నగరంలోని సంఘం భవనంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎంపిక లోపభోయిష్టంగా ఉందన్నారు. వైరా, కల్లూరు, సింగరేణి, వేంసూరు, ఖమ్మం అర్బన్,కామేపల్లి మండలాల్లో ఎంపిక ప్రక్రియ సరిగా జరగలేదన్నారు. గత సంవత్సరం ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించిన విద్యాశాఖ అవార్డులు ఇవ్వకుండా నిరుత్సాహానికి గురిచేసిందని, అవార్డుల కోసం దరఖాస్తు చేయుటకు అవకాశం కల్పించలేదని అన్నారు. సంఘాలతో సమన్వయ సమావేశం నిర్వహించలేదని, కనీసం ఉపాధ్యాయ సంఘాలను కార్యక్రమానికి ఆహ్వానించలేదని, జిల్లా విద్యాశాఖ ఒంటెత్తు పోకడలను విడనాడాలని జిల్లా కమిటీ సూచించింది. కొన్ని పాఠశాలల్లో పాత వారికి, కొన్ని పాఠశాలల్లో నూతనంగా విధుల్లో చేరిన వారికి అవార్డులు ఇచ్చారని ప్రక్రియ అంతా లోపభూయిష్టంగా జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి.వెంకన్న, షమీ, కోశాధికారి వల్లంకొండ. రాంబాబు జిల్లా కార్యదర్శులు బానోత్ రాందాస్, ధర్మసోత్. నాగేశ్వరరావు, సురేష్, నరసయ్య, రామారావు, వలీ, తదితరులు పాల్గొన్నారు.

యూరియా నిల్వలను తనిఖీచేసిన తహసీల్దార్, ఎస్ఐ

కారేపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంలో ఆదివారం తహసీల్దార్ ఏ.రమేష్, ఎస్ఐ బైరు గోపి యూరియా నిలవలను తనిఖీ చేశారు. రైతులకు కారేపల్లి సహకార సొసైటీ నుంచి సకాలంలోనే యూరియాను అందిస్తున్నట్లు అధికారులకు వివరించారు. సొసైటీ సీఈవో బొల్లు హనుమంతరావు, సొసైటీ డైరెక్టర్ డేగల ఉపేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆరంభ శూరత్వంగా.. మిర్చి కొనుగోళ్లు

» కొనుగోళ్లకు అడ్డుపడుతున్నదెవరో?

వైరా, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నడిబొడ్డున ఉన్న వైరా వ్యవసాయ మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు ఆరంభ శూరత్వంగా మారాయి. ఇక్కడ మిర్చి కొనుగోళ్లు జరుగకుండా ఒకరిద్దరు తమ పలుకుబడితో అడ్డుకుంటున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. మిర్చి కొనుగోళ్లు లేని కారణంగా మార్కెట్ కమిటీ ఆదాయాన్ని నష్టపోతుంది. ఈ ఏడాది జూన్ 16వతేదీన ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఏఎంసీలో అట్టహాసంగా మిర్చి కొనుగోళ్లు ప్రారంభించారు. ఆతర్వాత ఒక్క మిర్చి బస్తా కొనుగోలు కూడా ఇక్కడ జరుగలేదు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అదనపు డైరెక్టర్ ఆర్.లక్ష్మణుడు వైరా వచ్చి ఈ ప్రాంతంలోని మిర్చి వ్యాపారులు, కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులతో ఒక సమావేశాన్ని ఏర్పాటుచేసి అభిప్రాయాలు సేకరించారు. ఖమ్మం మార్కెట్‌కు మిర్చి బస్తాలు పోటెత్తిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది. వైరా మార్కెట్ యార్డులో మిర్చి కొనుగోళ్లు చేస్తామని అదనపు డైరెక్టర్ లక్ష్మణుడు ఆరోజు ప్రకటించారు. మిర్చి కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని ప్రకటించారు. అనంతరం జూన్ 16న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆర్భాటంగా మిర్చి కొనుగోళ్లను ప్రారంభించారు. అయినప్పటికీ ఇంతవరకు అతీగతీ లేదు.

వైరా మార్కెట్‌యార్డు పరిధిలో 13కోల్డ్‌స్టోరేజీలు..

వైరా వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాలున్నాయి. ఈ మూడు మండలాల్లో 13దాకా కోల్డ్‌స్టోరేజీలున్నాయి. అత్యధికంగా తల్లాడ మండలంలో ఆతర్వాత కొణిజర్ల, వైరా మండలాల్లో కోల్డ్‌స్టోరేజీలు పనిచేస్తున్నాయి. అయితే వైరా మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు చేయకుండా కోల్డ్‌స్టోరేజీల వద్దనే వ్యాపారులు మిర్చి కొనుగోళ్లు చేస్తూ రైతులను దోచుకుంటున్నారు. తల్లాడ నుంచి వైరాకు కేవలం పదికిలోమీటర్లు, కొణిజర్ల నుంచి ఎనిమిదికిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వైరా మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు చేస్తే రైతులకు కొంత గిట్టుబాటు ధర లభిస్తుంది. ఉదాహరణకు మధిర మార్కెట్ యార్డు పరిధిలో కోల్డ్‌స్టోరేజీలు 20కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. అయినప్పటికీ అక్కడ విధిగా మార్కెట్ యార్డులోనే మిర్చిలాట్లు పెట్టి వ్యాపారులు రైతుల నుంచి మిర్చి కొనుగోళ్లు చేస్తున్నారు. అయితే వైరా మార్కెట్‌యార్డు పరిధిలో కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చిని రైతుల నుంచి తక్కువ ధరకు వ్యాపారులు కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు.



వైరా ఏఎంసీ

కొనుగోలు సౌకర్యాలకు కొదవలేదు..

ఈ మార్కెట్‌యార్డులో మిర్చి క్రయ, విక్రయాలకు అవసరమైన అన్ని సౌకర్యాలున్నాయి. ఐదు ఓపెన్ షెడ్లు, నాబార్డు, నాన్‌నాబార్డు నిధులతో నిర్మించిన దాదాపు 15వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాములు, మార్కెట్ సిబ్బంది, హమాలీలు అందుబాటులో ఉన్నారు. ఇక్కడ రైతులకు కావల్సిన అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయినప్పటికీ మార్కెట్‌యార్డులో మిర్చి కొనుగోళ్లు జరగడం లేదు.

ఆదాయాన్ని కోల్పోతున్న మార్కెట్..

కోల్డ్‌స్టోరేజీల వద్దనే మిర్చి క్రయ, విక్రయాలు జరుగుతున్నందున సెస్ రూపేణా రావల్సిన రూ.కోటికిపైగా ఆదాయాన్ని మార్కెట్ కోల్పోతుంది. గతంలో కేవలం చెక్‌పోస్టుల వద్ద మిర్చికి సంబంధించి సెస్ రూపేణా రూ.60నుంచి రూ.70లక్షల వరకు మార్కెట్‌కు ఆదాయం లభించేది. ఇప్పుడు కోల్డ్‌స్టోరేజీల వద్దనే రైతుల నుంచి వ్యాపారులు తక్కువ ధరకు మిర్చి కొనుగోళ్లు చేసి పక్కదారి పట్టిస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. దాంతో చెక్‌పోస్టుల ద్వారా రావల్సిన సెస్‌ను కూడా మార్కెట్ కమిటీ నష్టపోతుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏడాదికి రూ.కోటికి పైగానే మార్కెట్ కమిటీ ఆదాయాన్ని కోల్పోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు మిర్చి సాగుచేస్తున్నారు. ఈ సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం రైతులు కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చిని అయినకాడికి తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు. అక్టోబరు వరకు కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చిని రైతులు పెట్టుబడుల కోసం విక్రయిస్తూనే ఉంటారు. అసలే ఈ ఏడాది మిర్చి ధర భారీగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు కోల్డ్‌స్టోరేజీల్లోని మిర్చిని వ్యాపారులు అడిగిన తక్కువ ధరకు విక్రయిస్తూ మరింతగా నష్టపోతున్నారు. అందువల్ల మార్కెట్‌లో కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



మిర్చి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే(ఫైల్)

10న జరిగే రైతు సదస్సును జయప్రదం చేయండి

వైరా, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 10న ఖమ్మంలో జరిగే జిల్లా రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు దొబ్బల కృష్ణ, కొండా రామకృష్ణలు విజ్ఞప్తి చేశారు. మండలంలోని సిరిపురం గ్రామంలో బండారుపల్లి ముత్తయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన రైతుసంఘ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో వల్లకొండ శ్రీనివాసరావు, తాటికొండాల సూర్యం, మేడేపల్లి వెంకటేశ్వర్లు, షేక్.ఇమామ్‌బీ, ఖాసీం పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

బోనకల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో ఆదివారం ఇటీవల మృతి చెందిన దిరివరపు నారాయణ కుటుంబానికి మాజీ సర్పంచ్ చంద్ర సరిత, శ్రీనివాసరావు దంపతులు రూ. 7వేల నగదు సాయాన్ని అందించారు. కాంగ్రెస్ నాయకులు రాటుకొండ రమేష్ బాబు, మెట్టెల నర్సింహారావు, అంజి, బుజ్జి, కృపానందం పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

చింతకాని, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో వినాయక నిమజ్జనం సమయంలో బొడ్రాయి సెంటర్‌లో శనివారం రాత్రి వివాదం ఏర్పడింది. ఈ వివాదంలో బత్తుల పద్మ, బత్తుల శివకృష్ణపై నలుగురు వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయమై పద్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బత్తుల వెంకయ్య, బత్తుల ఆంజేయులు, బత్తుల అప్పారావు, బత్తుల రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పలువురికి మంత్రి తుమ్మల పరామర్శ



చీకటి కృష్ణయ్య కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం సత్తుపల్లిలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. పట్టణంలోని శ్రీనివాసా టాకీస్ రోడ్‌లో ఇటీవల కాశీలో మృతి చెందిన చీకటి కృష్ణయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యానికి గురైన కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లగుళ్ల నరసింహారావును పరామర్శించి ఆరోగ్య వివరాలు తెలుసుకుని త్వరగా కోలుకోవాలని కోరారు. ఆయన వెంట మదర్‌థెరిస్సా విద్యాసంస్థల అధినేత చలసాని సాంబశివరావుతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

» ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచడం పట్ల పలువురి హర్షం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న భవననిర్మాణ రంగ కార్మికులు

కల్లూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కల్లూరులో కార్మికులు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటైన సభలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు దర్నాసి బాలరాజు మాట్లాడుతూ.. అనేక పోరాటాల ఫలితంగా ప్రమాద బీమాను రూ.6 లక్షలనుంచి రూ.10లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. సీపీఐ మండల కార్యదర్శి దామాల దయాకర్‌రావు మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన భవన రంగ కార్మికులు తమ పేర్లను బీమా పాలిసీలో నమోదు చేసుకోవాలని కోరారు. తాపీ వర్కర్స్, ప్రైవేట్ ఎలక్ట్రీషిన్, పలు రంగాల కార్మిక సంఘాల నాయకులు రవి, మహబు, చారి, ఎస్‌కె జానీ, బసబయ్య, వజీర్‌మియా, చార్లెస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

తల్లాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుసమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాన రాష్ట్ర రైతుసంఘం ఆధ్వర్యంలో ఆదివారం తల్లాడలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగు నరసింహారావు , తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకుడు నల్లమోతు నరసింహారావు మాట్లాడుతూ.. రైతులు యూరియా కోసం పడిగాపులు కాస్తూ రోజుల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సిన పరస్థితి ఏర్పడిందన్నారు. అయినా అవసరమైన యూరియా లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల భారీవర్షాలకు వరి, పత్తి పంటలకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. భారీవర్షాల వల్ల జరిగిన పంట నష్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమీక్షలు నిర్వహించి రైతులకు మేలుజరిగే విధంగా పరిహారం అందించాలని కోరారు. సకాలంలో ఎరువులు అందించాలని, రైతుసమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రధాని మోదికి దేశవ్యాప్తంగా కోటి మంది రైతుల సంతకాల సేకరణ జరిపి పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రావి శివరామకృష్ణ, దండు ఆదినారాయణ, గాదె లక్ష్మినారాయణ, రామకృష్ణ మల్లేష్, శ్రీను, రవీందర్‌పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు చిరునామా బత్తినేని ట్రస్టు

» ప్రముఖ ఎన్ఆర్ఐ బత్తినేని రాకేష్

» ట్రస్టు ఆధ్వర్యంలో వైద్య శిబిరం విజయవంతం

బోనకల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అమరజీవి తూము ప్రకాశరావు ఆశయ సాధనలో భాగంగా పేదల కొరకు బత్తినేని ట్రస్టు ద్వారా పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ప్రముఖ ఎన్ఆర్ఐ, ట్రస్టు సభ్యుడు బత్తినేని రాకేష్ తెలిపారు. బోనకల్‌లో ఆదివారం బత్తినేని ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. బీపీ, షుగర్ వ్యాధి గ్రస్తులకు పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గడచిన 5 ఏళ్లుగా బోనకల్‌లో 60 పర్యాయాలు వైద్య శిబిరాలు నిర్వహించిన సందర్భంగా ట్రస్టు నిర్వాహకులను మండల అఖిలపక్ష పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. తాత ప్రకాశరావు పేదల కోసం ప్రాణాలర్పించారని గుర్తు చేశారు. ఆయన స్ఫూర్తితో పేద విద్యార్థులు, వైద్య శిబిరాలు, పలు చేయూత కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ బత్తినేని నాగ ప్రసాదరావు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, తూము రోషన్ కుమార్, దొండపాటి నాగేశ్వరరావు, యంగల ఆనందరావు, తోట రామంజనేయులు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు, నందమూరి సత్యనారాయణ, టీయుడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న బత్తినేని రాకేష్

గౌడ్స్ ఐక్యతతో రాజకీయంగా ఎదగాలి

» విద్యావేత్త కందిమళ్ల కృష్ణారావు

పెనుబల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గౌడ సామాజిక వర్గం నేటి సమాజంలో అత్యధికంగా అన్ని రాజకీయ పార్టీల్లో పనిచేస్తూ ప్రజాప్రతినిధులుగా రాణించాలని గౌడ సంఘం సీనియర్ నాయకుడు, విద్యావేత్త కందిమళ్ల కృష్ణారావు సూచించారు. ఆదివారం గంగదేవిపాడు గ్రామంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ గౌడ సంఘం అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలో గౌడ సామాజిక వర్గం తగిన స్థాయిలో ప్రజాప్రతినిధులుగా రాణించలేకపోతోందని, పదవులను సాధించేందుకు గౌడ జాతి ఐక్యమత్యంగా పని చేయాలన్నారు. పెనుబల్లిలో ఫ్రీజర్ బాక్సు రవాణాకు వాహనాన్ని, గౌడసంఘం భవనాన్ని ఏర్పాటుచేయాలని తీర్మానించారు. గౌడ సంఘం మాజీ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, ప్రస్తుత అధ్యక్షుడు ఈడా కమలాకర్‌రావులను సన్మానించారు. కార్యక్రమంలో గౌడసంఘం నాయకులు చలమాల విఠల్‌రావు, వేముల కృష్ణయ్య, వంగా దామోదర్‌రావు, ఈవీ.రమేష్, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, చీపు నర్సింహారావు, వెంకటేశ్వరరావు, బొర్రా వెంకటేశ్వరరావు, కొనకాల వెంకటస్వామి, దొంతు మాధవరావు, గోదా చెన్నారావు పాల్గొన్నారు.

కట్ట యూరియా కోసం రోజంతా..

» ప్రసాదంలా పంపిణీ చేసిన అధికారులు

వేంసూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక యూరియా కట్ట కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఒక యూరియా కట్ట కోసం ఒకరోజు పని చెడగొట్టుకున్నామని రైతులు వాపోయారు. వేంసూరు సొసైటీకి 22రోజుల తర్వాత శనివారం 400యూరియా బస్తాలు వచ్చాయి. ఈ బస్తాల కోసం గతంలోనే వెయ్యిమంది రైతులు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులను సీరియల్‌లో పెట్టి ఉంచారు. ఆదివారం ఉదయం ఆరుగంటలకు రైతులు సొసైటీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉదయం నుంచి కూపన్లు రాసి సాయంత్రం వరకు 400యూరియా బస్తాలను రైతులకు పంపిణీ చేశారు. నాలుగెకరాలు ఉన్న తమకు ఒక కట్ట యూరియా ఎటూ సరిపోవడం లేదని రైతులు వాపోయారు. ప్రసాదంలా యూరియా కట్టలు పంపిణీ చేసినప్పటికీ ఇంకా 600మంది రైతులు పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులు సీరియల్‌లో పెట్టి వెనుదిరిగి వెళ్లిపోయారు.

ముదిగొండ: యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ముదిగొండ సొసైటీ వద్ద ఆదివారం ఉదయం నుంచి రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. ముందుగా సొసైటీ సిబ్బంది, వ్యవసాయ అధికారులు రైతులకు కూపన్లు ఇచ్చారు. ఆ తర్వాత రైతులకు యూరియా కట్టలను పంపిణీ చేశారు. ఒక్కో యూరియా కట్ట ఇస్తుండడంతో తమకు ఎటూ సరిపోవడం లేదని రైతులు వాపోయారు. అధికారులు స్పందించి తమకు సరిపడా కట్టలు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

మహాలక్ష్మి పథకం కోసం నేడు ధర్నా

» విజయవంతం చేయాలని సీపీఐ నాయకుల విజ్ఞప్తి

కల్లూరు, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి) మహాలక్ష్మి పథకాన్ని మహిళలందరికీ అమలు చేయాలని సత్తుపల్లి డివిజన్ సీపీఐ అనుబంధ కార్మిక సంఘం నాయకులు దండు ఆదినారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం కల్లూరులో సీపీఐ అనుబంధ కార్మిక సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న నేటి వరకు మహాలక్ష్మి పెన్షన్ పథకాన్ని అమలు కాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. వృద్ధులకు, వితంతువులకు రూ.4 వేలు పెన్షన్ పెంచాలని, వికలాంగులకు రూ.6 వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నేడు ఖమ్మం కలెక్టరెట్ వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన వ్యవసాయ కార్మికులకు పిలుపునిచ్చారు. పేదలకు ఇళ్లు, ఇళ్లస్థలాల పట్టాలు,పోడు భూముల పట్టాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధిహామీ పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కేటాయించాలని, అర్హులైన పేదలకు అసర పెన్షన్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఎస్‌కె రంజాన్‌బి, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, లాల్‌మహ్మద్, సిపిఐ మండల కార్యాదర్శి దామాల దయాకర్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా నిమజ్జనాలు.. లడ్డూ వేలంపాటలు..

వైరా, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం, వాసవీ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. 11వ రోజు నిమజ్జన శోభయాత్రను ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రారంభించారు. వేలంపాటలో రూ.1.5లక్షలతో కొల్లా రాంబాబు అనే భక్తుడు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతలు 50మందికి దుస్తులు పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు వనమా విశ్వేశ్వరరావు, మండల అధ్యక్షుడుకిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: వినాయక చవితి సందర్భంగా నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాధుడికి శనివారం రాత్రి నిమజ్జనం భక్తిపారవశ్యంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంపాటలో శ్రీ ప్రసన్న గణపతి లడ్డూను కేశవరెడ్డి రూ.4.05లక్షలు, శ్రీ మహాగణపతి పీఠంలో రూ.1.20లక్షలకు సాత్విక్‌నాయుడు, 16వ వాసవీ గణపతి లడ్డూను రూ.1,11,111కు సోమిశెట్టి శ్రీధర్, వాసంతీ దంపతులు, గంగారంలో ప్రధాన రహదారిలో రూ.1.05లక్షలు, ఆంజనేయస్వామి గుడిలో 1.08లక్షలు, బాలరాముడిది రూ.85వేలు, పాకలగూడెంలో రూ.75వేలకు సర్వేశ్వరరావు, పట్టణంలోని హనుమాన్ నగర్‌లో రూ.46వేలకు రాజా, సురేష్ సైకిల్ షాప్ రోడ్‌లో రూ.45వేలకు అనుమోలు భరత్, తుమ్మూరు రామారావు రోడ్‌లో రూ.42వేలకు తిగుళ్ల పుల్లారావు, మెట్టాంజనేయ స్వామి ఆలయంలో రూ.25,1116కు అలవాల వెంకటరెడ్డి, సత్యవేణి దంపతులు, హనుమాన్ యూత్ లడ్డూను రూ.25వేలకు నరుకుళ్ల వెంకటేశ్వరరావు (బుడ్డీ), నేతాజీ రోడ్‌లో విజయలక్ష్మీ మొబైల్స్ నిర్వహకులు రూ.25వేలు, శ్రీనివాసా టాకీస్ రోడ్‌లో కే.కార్తీక్, ఎం.రమేష్‌లు రూ.21వేలు, కల్పతరువు రోడ్‌లో పొట్లపువ్వు నాగరాజు రూ.19వేలు, రూ.12వేలకు దూదిపాల రాంబాబు, అయ్యగారిపేట ఆంజనేయస్వామి ఆలయంలో రూ.15,500కు మేకా సతీష్‌రెడ్డిలు వేలంపాటల ద్వారా దక్కించుకున్నారు.

తల్లాడ: తల్లాడలో గణనాధుని నిమజ్జన శోభాయాత్ర ఘనంగా జరిగింది. ప్రధాన వీధుల్లో యా త్రను నిర్వహించారు. సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, ఉత్సవ కమిటీసభ్యులు వేమిరెడ్డి నాగిరెడ్డి, నంబూరి కనకదుర్గప్రసాద్, దగ్గుల రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు లడ్డూను అందజేస్తున్న నాయకులు, నిర్వాహకులు

జమలాపురం ఆలయం మూసివేత

ఎర్రుపాలెం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం కారణంగా అర్చకుల ద్వార బంధనం చేసి మూసివేశారు. బాద్రపద పౌర్ణమి, శతభిష నక్షత్రంలో కుంభరాశిలో ఆదివారం రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహంన ఏర్పడనుందని ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ తెలిపారు. రాత్రి 9-56గంటలనుంచి 1-36గంటల వరకు ఈ చంద్రగ్రహణం ఉంటుందని సెప్టెంబరు 8న సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని మహా సంప్రోక్షణ , శుద్ధి అనంతరం ఉదయం పదిగంటలకు శ్రీవారి దర్శనం కలిపిస్తామని తెలిపారు.

సత్తుపల్లి: ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా పట్టణంలోని శ్రీ కోదండ రామాలయాన్ని ఆలయ నిర్వహకులు మూసివేశారు.

రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్లు..

బోనకల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14, 15వ తేదిలల్లో జనగామ జిల్లా కునూరు నందు జరగనున్న 44వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్లను బోనకల్‌లో ఆదివారం ఎంపిక చేశారు. సబ్ జూనియర్ పోటీలకు బాలుర జట్టుకు జి.సురేష్, బి.హర్షవర్ధన్, ఎస్‌కె. రహ్మాన్, వినయ్, ఎస్‌కె.మునీరుద్దీన్, ఎస్‌కె.షోయబ్, నజురీద్దిన్, ఆద్నాన్ సామి, బాలికల జట్టుకు ఎన్.మనీష, కె.నవ్య, కె.ఆకాంక్ష, ఆర్.సాహితి, కె.అక్షయ, వి.రాజేశ్వరి, ఎస్.మోక్షిత, సిహెచ్.సిగ్నత, యశ్విత, రిషిత, అక్షయలు ఎంపికయ్యారు. జూనియర్ బాలుర జట్టుకు జి.గోపి, యాసర్, అదిల్, జోషి, గణేష్, జయదీప్, సురేష్, దనుష్, శ్రీహరి, రఘురామ్, ఎం.చరణ్, జానకీరామ్, బాలికల జట్టుకు జశ్వతి, రష్మి, మధులత, ఊహిత, మనీషా, నవ్య, ఆకాంక్ష, సాహితి, అక్షయ, రాజేశ్వరి, ఉమామహేశ్వరి, భూలక్ష్మీలు ఎంపిక కాబడ్డారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, అధ్యక్షుడు వి. సురేష్ కుమార్, కోచ్ అమరేశి లింగయ్య పాల్గొన్నారు.

సాధించుకున్న పెన్షనర్ల సౌకర్యాలు కోల్పోతున్నాం

కల్లూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలతో పోరాటాల ఫలితంగా సాధించుకున్న పెన్షనర్ల సౌకర్యాలను మరోసారి కోల్పోవాల్సి వస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య అన్నారు. కల్లూరులో ఆదివారం మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 1982లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు భిన్నంగా కొత్త పెన్షన్ విధానంతో పెన్షనర్లు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో పెన్షనర్ల మధ్య వివక్షతకు దారితీసిందని విమర్శించారు. 9వ పీఆర్సీలో ప్రభుత్వ పెన్షనర్లకు మాత్రమే హెల్త్ కార్డులు ఇచ్చి క్యాష్ లెస్ వైద్య సౌకర్యం కల్పించినా గత 15 సంవత్సరాలుగా నుంచి నేటి వరకు అమలు జరగడం లేదని అన్నారు. ప్రభుత్వ విధానాలతో డిఏలు ఐదు, పీఆర్సిల ప్రస్తావనే లేదని ఆయన ఎద్దేవ చేశారు.

11న మిడ్డే మీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

తల్లాడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 11న తల్లాడలో జరిగే మధ్యాహ్న భోజన పనథకం వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఖమ్మంజిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు తెలిపారు ఆదివారం స్థానిక యూనివర్శల్ స్కూల్‌లో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు పౌష్టికాహారం లోపాన్ని తగ్గించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మధ్యాహ్న భోజన పథకం వల్ల వంట కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అనంతరం మహాసభ ఆహ్వాన సంఘాన్ని ఎన్నుకున్నారు. ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడుగా టీకే ప్రసన్నకుమార్, అధ్యక్షుడుగా నిమ్మటూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా టీ.లక్ష్మి, ఉపాధ్యక్షుడుగా మహదేవలక్ష్మి, సత్యవతి, కె.వెంకటలక్ష్మి, కార్యదర్శులుగా జి.మల్లేష్, షేక్ రంజాన్, కె.వెంకమ్మ, షేక్ రహమనీసా; రమాదేవి,ఇ కర్రి రామంజమ్మ, కోశాధికారిగా పద్మ ఎన్నికయ్యారు. ఏఐటీయూసీ ఖమ్మంజిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదే లక్ష్మినారాయణ, తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రావిశివరామకృష్ణ, ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, గుండెపోగు మల్లేష్, బీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, రైతుసంఘం ఏఐటీయూసీ నాయకులు నల్లమోతు నరసింహారావు, తడికమల్ల యోబు, పాల్గొన్నారు.

మోదీ సర్కార్‌పై సమరం

కొణిజర్ల , సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పంటలకు యూరియా సంపూర్ణంగా, రైతులకు అందించే వరకు కేంద్రంలో ఉన్న బీజేపీ, నరేంద్రమోదీ సర్కారుపై రైతులు, సమరశీల పోరాటాలకు సమాయత్తం కావాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, జిల్లా సీపీఐ కౌన్సిల్ సభ్యులు మునగ కోటేశ్వరరావు కోరారు. ఆదివారం మండలంలోని అమ్మపాలెం గ్రామంలో జరిగిన రైతుసంఘం సమావేశంలోప్రసంగించారు. సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగంను దెబ్బతీసి కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించి రైతులను కూలీలుగా మార్చే ప్రయత్నంలో వ్యవసాయ సంస్కరణల చట్టాలను ప్రధాని మోదీ ప్రభుత్వం తెచ్చిందన్నారు.